ANN తెలుగు

Follow: @ANNTELUGU

12-07-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 188  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM

రాజకీయ చదరంగం

## ఎత్తుకు పైఎత్తు

రాజకీయాలు అంటేనే నిరంతర చదరంగం. ఒక అడుగు వేస్తే, ప్రత్యర్థి పది అడుగులు ఆలోచించే పరిస్థితి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీలిమిటేషన్ పై సంచలన ప్రకటన చేశారు. డీలిమిటేషన్ ఖాయమని, 117 స్థానాల్లో గెలవబోతున్నామని ధీమా ప్రదర్శించారు. మరో రెండున్నరేండ్ల తర్వాత జరగబోయే ఎన్నికలపై ఇపుడే సవాళ్ళు విసిరి.. బీఆర్ఎస్ ను ముగ్గులోకి లాగే ప్రయత్నాలు చేస్తున్నాడు. గత ఎన్నికల ముందు సవాళ్ళతోనే బీఆర్ఎస్ కు షాకిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇపుడు కూడా మరో పదునైన వ్యూహంతో సై అంటున్నారు. 119 నుండి 182 స్థానాలు వస్తాయని ప్రకటించడంతో పాటు బీఆర్ఎస్ సర్వేలను ఎద్దేవా చేయడం వెనుక వ్యూహాలు స్పష్టం. ఏపీలో పవన్ ను టార్గెట్ చేసిన వారిపై చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారు. కొత్త సోషల్ మీడియా నియంత్రణ చట్టాలకు పదునుపెడుతున్నారు.

04




తెలుగు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

**కంది రామచంద్రారెడ్డి**

**వీకెండ్ అనాలసిస్**

టాప్ న్యూస్

### పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తాం : చంద్రబాబు



02

### పవన్ కల్యాణ్‌కు ఆపరేషన్

విజయవంతంగా భుజం శస్త్రచికిత్స



02

### ఖమేనీ మృతికి ప్రతీకారం తప్పదు

ఇరాన్ సుప్రీం మొజ్తబా ఖమేనీ



02

కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ

# సూచనలే పాటిస్తాం




కిలాడీల కమిటీ సూచనలు పాటించం

**బీఆర్ఎస్ కు సీఎం రేవంత్ రెడ్డి కౌంటర్**

పారుతున్న నీళ్లను ఎత్తిపోస్తే బ్యారేజీలు ఎందుకు?

**ప్రాజెక్టులోని 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ తెలిపింది**



**ఈటల ఎన్ డిఎస్ ఏతో కమిటీ వేయిస్తే వారికి వెంటనే బ్యారేజీలు అప్పగిస్తాం**

**మేమయితే నీళ్లు ఎత్తిపోయం..**

**అలా చేస్తే భద్రాచలం మునుగుతుంది**

**హైదరాబాద్, మహా:** కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెబుతున్నారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ చెబుతున్నట్లు కళ్లముందు నీళ్లు పారుతున్నంత మాత్రాన ఎత్తిపోసే అవకాశం ఉంటే బ్యారేజీలు కట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. బ్యారేజీలు కట్టడం మిగతా 2వ పేజీలో

**జూలై 18న**

# యంగ్ టైగర్ బిగ్ అనౌన్స్‌మెంట్?

తారక్ అభిమానుల్లో ఆసక్తి

ఏపీ పాలిటిక్స్ లో సునామీ ఖాయమా?



సేవా కార్యక్రమాలతో ఆరంభం.. ఏడాది తర్వాత అసలైన వ్యూహం


**హైదరాబాద్, మహా :** జూనియర్ ఎన్టీఆర్ ఏం చేయబోతున్నారు. తారక్ ఫ్యాన్స్ తో పాటుగా సినీ పొలిటికల్ సర్కిల్స్ లో జూ ఎన్టీఆర్ పై భారీ అంచనాలు పెరుగుతున్నాయి. ఏపీ రాజకీయ రణక్షేత్రంలోకి నందమూరి వంశం నుండి మరో నటుడు, ఎన్టీఆర్ మనవడు జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విజయ్ విజయం తర్వాత పాలిటిక్స్ పై ఆశలున్న అనేకమంది స్టార్స్ ఆంతరంగికులతో, కుటుంబసభ్యులతో వ్యూహకర్తలతో చర్చిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ 2029 టార్గెట్ గా రాజకీయాల్లోకి రావాలని 2009లోనే డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ కు ప్రజలను సమ్మోహపరిచే శక్తి ఉందని, 2009లోనే స్టార్ క్యాంపెయినర్ గా రుజువు చేసుకున్నారు. అయితే ఒకేసారి రాజకీయ రూపం కాకుండా.. అభిమాన సంఘాలన్నింటినీ మిగితా 2వ పేజీలో

### వియత్నాంలో బోటు ప్రమాదం

- తెలుగు టూరిస్టులు సహ 18 మంది మృతి
- ప్రమాదానికి గురైన బోటులో 32 మంది ఉన్నట్లు సమాచారం
- కొనసాగుతున్న సహాయక చర్యలు
- కంట్రోల్ రూం ఏర్పాటు చేసిన ఎంబసీ

02





02

### షాబాద్‌లో ఆరుగురి హత్య ఎస్సై సస్పెన్షన్

- నిందితుడిపై రూ.2 లక్షల రివార్డ్
- ఆరు హత్యల నిందితుడిని అప్పగించాలని ఆందోళన

02

భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌పై

### సింగరేణి దృష్టి

బెల్లంపల్లిలో పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు










### గాన కోకిల ఎస్. జానకి మృతి

**.. సీఎం రేవంత్, కేంద్రమంత్రుల సంతాపం**

**హైదరాబాద్, మహా :** ప్రముఖ సినీనేపథ్య గాయని ఎస్. జానకి గుండెపోటుతో మరణించారు. మైసూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జానకి శనివారం ప్రాణాలు విడిచారు. ఎస్. జానకి మృతికి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు తమ సంతాపాన్ని తెలిపారు. ప్రముఖ గాయని ఎస్. జానకి మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచంలో జానకి గారు తన గళమాధుర్యంతో సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని తెలిపారు. గాన కోకిల ఎస్. జానకి కన్నుమూశారనే వార్త ఎంతో విచారకరమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆమె పాడిన వేలాది పాటలు, వైవిధ్యభరితమైన స్వరాలు తరతరాలకు చిరస్మరణీయం, జానకి కేవలం గాయని మాత్రమే కాదు, భారతీయ సంగీతానికి ఒక నిధి అన్నారు.




# వియత్నాంలో బోటు ప్రమాదం

**తెలుగు టూరిస్టులు సహా 18 మంది మృతి**



**హనోయ్, మహా :** వియత్నాంలో భారత టూరిస్టులు ఉన్న బోటు ప్రమాదానికి గురైంది. వియత్నాంలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఫుక్వోక్ ద్వీపం సమీపంలో ఒక పడవ బోల్తా పడింది. ఈ పడవలో వెళ్తున్న వారిలో 18 మంది మృతిచెందారని తెలుస్తోంది. ఏపీ, తెలంగాణకు చెందిన టూరిస్టులు దాదాపు 32 మంది ఆ బోటులో ఉన్నారు. లావా కంపెనీ తరఫున ఏపీకి చెందిన పలువురు విహారయాత్రకు వెళ్లారు. తాము స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) స్పందించింది. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది.ఈ ప్రమాదానికి సంబంధించిన కచ్చితమైన వివరాలు, బోటులో మొత్తం ఎంతమంది పర్యాటకులు ఉన్నారు.. వారి ప్రస్తుత పరిస్థితి ఏమిటన్న విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం 'ఎక్స్' లో స్పందిస్తూ.. 'ఓ విషాదకరమైన ఘటనలో, కొన్ని గంటల క్రితం వియత్నాంలోని ఫు క్వాక్ ద్వీపం సమీపంలో పలువురు భారతీయ పర్యాటకులతో వెళ్తున్న బోటు బోల్తా పడింది. స్థానిక అధికారులు రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తున్నాం'.అని పేర్కొంది. ప్రమాదానికి గురైన పర్యాటకుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు, అవసరమైన సహాయం చేయడానికి భారత ప్రభుత్వం వియత్నాంలో తక్షణమే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది.

# పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తాం : చంద్రబాబు



**విజయవాడ, మహా :** జనాభా నియంత్రణ కాదు.. జనాభా సంరక్షణ నినాదం రావాలని సీఎం చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు జనాభా తగ్గాలని అందరం కోరుకున్నామని, ఇద్దరికంటే ఎక్కువ మంది ఉంటే స్థానిక సంస్థల్లో పోటీకి అనర్హులని చెప్పామని అన్నారు. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని తెలిపారు. పిల్లలే సంపద అనే మాటను నిజం చేస్తామన్నారు. విజయవాడలో నిర్వహించిన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో చంద్రబాబు ప్రసంగించారు. ''ప్రపంచవ్యాప్తంగా జనాభా తగ్గిపోతోంది. యువత ఆశలు, ఆకాంక్షలను సాకారం చేయాలి. ఆడపిల్లలు ఇప్పుడు ఇంటికి భారం కాదు.. ఆస్తి. ఐటీ చదువుకోవాలని గతంలో ఆడపిల్లలను ప్రోత్సహించా. వరకట్నం కాదు.. ఆడపిల్లలకే ఎదురుకట్నం ఇచ్చే పరిస్థితి వచ్చింది. పిల్లలు వద్దనుకునే దంపతులు పెరగడం దురదృష్టకరం. దక్షిణాది రాష్ట్రాల్లో ఏటా జనాభా తగ్గిపోతోంది. నగరాలు, అర్బన్ ప్రాంతాల్లో జనాభా బాగా తగ్గిపోతోంది. పిల్లల సంఖ్య తగ్గి.. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ఇంట్లో పెద్దలు లేకపోతే పిల్లల పెంపకంలో అనేక ఇబ్బందులు వస్తాయి. పిల్లలే మన రాష్ట్ర సంపద.. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు వస్తాయి. పిల్లల్ని పెంచే బాధ్యతను తండ్రి కూడా తీసుకోవాలి. ఇంటిపని, వంటపని అనే తేడా లేదు. అన్నింట్లోనూ మగవాళ్లు సాయం చేయాలి. సంజీవిని కింద డిజిటల్ ఆరోగ్య రికార్డులు తీసుకుంటున్నాం. మెంటల్ సిక్‌నెస్ అతి పెద్ద సమస్యగా తయారైంది. సోషల్ మీడియా వల్ల మానసిక సమస్యలు పెరుగుతున్నాయి. విలువైన సమయం వృథా చేసుకుంటున్నారు. నేటి యువత యోగా, ధ్యానం అలవరచుకోవాలి. 60 ఏళ్లు దాటాక సమాజం కోసం పని చేయాలి. జీవితాంతం నేర్చుకుంటూనే ఉండాలి. నైపుణ్యాలు పెంచుకోవాలి. నియంత్రణ లేకుంటే ఏ టెక్నాలజీ అయినా ప్రమాదమే. ప్రతి ఒక్కరూ జీవితాన్ని సరిగా ప్లాన్ చేసుకోవాలి. జనాభా తగ్గిపోతే అనుకున్న లక్ష్యాలు సాధించలేం. 2040కే స్వర్ణాంధ్ర సాధించుకునే సత్తా మనకుంది '' అని చంద్రబాబు అన్నారు.

# షాబాద్‌లో ఆరుగురి హత్య



**హైదరాబాద్, మహా :** రంగారెడ్డి జిల్లాలోని షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరుగురు దారుణ హత్యకు గురైన ఘటనపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్‌పై రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి ఈ మొత్తాన్ని అందజేస్తామన్నారు. ఈ ఘటనలో షాబాద్ ఎస్సై రమేశ్‌ను సస్పెండ్ చేసినట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి వెల్లడించారు. ఈ కేసులో నిర్లక్ష్యం వహించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామన్నారు. మరోవైపు పరారీలో ఉన్న నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ దృశ్యాలు, టోల్‌ప్లాజా వివరాల ఆధారంగా దర్యాప్తు వేగవంతం చేశారు. దైవాలగూడకు చెందిన పార్వతి రాజ్ కుమార్ కట్టుకున్న భార్య, ఇద్దరు కుమారులతో పాటు, తనపై పోక్సో కేసు పెట్టిన మైనర్ బాలిక, ఆమె తల్లి లక్ష్మీ, నాయనమ్మ రుక్కమ్మలను కత్తితో నరికి చంపిన విషయం తెలిసిందే. మొదట షాబాద్ పీఆర్ ఆర్ స్టేడియం సమీపంలో ఉన్న మైనరు బాలిక (17)ఇంట్లోకి ప్రవేశించి.. ఆమెను బలవంతంగా లాక్కెళ్లే క్రమంలో బాలిక తల్లి, నాయనమ్మ అడ్డు పడ్డారు. నిందితుడు వారిద్దరినీ కత్తితో పొడిచి చంపాడు. అనంతరం బాలికను దైవాల గూడ సమీపంలోని అఖిల్ సాగర్ చెరువు సమీపంలోకి తీసుకెళ్లి పీక కోసి హత్య చేశాడు. అనంతరం దైవాలగూడలోని తన ఇంటికొచ్చి భార్య సరిత (33)తో పాటు ఇద్దరు కుమారులు పరీక్షిత్ (4), దైవీక్షిత్ (2)లను కత్తితో పీకలు కోసి దారుణంగా హతమార్చాడు.

పోలీస్ స్టేషన్ ముందు గ్రామస్థుల ఆందోళన

ఆరుగురు అమాయకుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్న నిందితుడు రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేసి కఠిన చర్యలు చేపట్టాలని మృతుల బంధువులు, స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు షాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట రహదారిపై బైఠాయించారు. దీంతో రంగారెడ్డి జిల్లా షాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలన్నారు. పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్యతో స్థానికులు వాగ్వాదానికి దిగారు. పోలీసుల వైఖరిని ఖండిస్తూ స్థానికులు నినాదాలు చేశారు. రాజ్‌కుమార్‌ను వెంటనే అరెస్టు చేయకపోతే మరొకరి ప్రాణాలు తీసే అవకాశం ఇచ్చినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి షాబాద్ పీఎస్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ కేసులో ఎస్ఐ రమేష్‌ను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. దీంతోపాటు ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు


# పవన్ కల్యాణ్‌కు ఆపరేషన్

**విజయవంతంగా భుజం శస్త్రచికిత్స**

**అమరావతి, మహా:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శనివారం ముంబైలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో కుడి భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ శస్త్రవైద్య నిపుణుడు డాక్టర్ దిన్‌షా పర్దివాలా నేతృత్వంలోని వైద్యుల బృందం సుమారు మూడున్నర గంటలపాటు ఈ శస్త్రచికిత్సను నిర్వహించింది. ప్రస్తుతం ఆయన అనస్థీషియా ప్రభావం నుంచి కోలుకుంటూ వైద్యుల నిశిత పర్యవేక్షణలో ఉన్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. వైద్య పరీక్షల్లో పవన్ కల్యాణ్‌కు రెండు భుజాల్లోనూ తీవ్రమైన రోటేటర్ కఫ్ గాయాలు ఉన్నట్లు నిర్ధారణ అయింది. ముఖ్యంగా కుడి భుజంలో రోటేటర్ కఫ్ చిరగడంతో పాటు అవల్షన్ ఫ్రాక్చర్ కూడా ఉండటంతో శస్త్రచికిత్స అవసరమైందని వైద్యులు తెలిపారు. రెండు భుజాలకు ఒకేసారి శస్త్రచికిత్స చేస్తే కోలుకునే ప్రక్రియ మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉండటంతో ముందుగా కుడి భుజానికే శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించారు. వైద్య నిపుణులు వీలైనంత త్వరగా శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించినప్పటికీ, ముందుగా నిర్ణయించిన అధికారిక కార్యక్రమాలు పూర్తయ్యే వరకు పవన్ కల్యాణ్ శస్త్రచికిత్సను వాయిదా వేసుకున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం తెలిపింది. ప్రభుత్వ బాధ్యతలు, ప్రజా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా చూసిన అనంతరం ఆయన ముంబై వెళ్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు.వైద్యుల సూచనల మేరకు కుడి భుజం పూర్తిగా కోలుకున్న తర్వాత ఎడమ భుజానికి కూడా శస్త్రచికిత్స నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతోందని పేర్కొన్నారు.ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విస్తృత ప్రజా పర్యటనలు, రాజకీయ కార్యక్రమాలు, ఎన్నికల ప్రచారాలు, పార్టీ కార్యకర్తలు, ప్రజలతో నిరంతర సమావేశాల కారణంగా 2016లో ఏర్పడిన భుజం గాయాలు క్రమంగా తీవ్రమయ్యాయని అధికారులు వివరించారు. తీవ్ర నొప్పిని భరిస్తూనే పవన్ కల్యాణ్ తన అధికారిక బాధ్యతలను నిరంతరంగా నిర్వర్తిస్తూ ప్రజా కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు.పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తామని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి అనంతరం ఆయన తిరిగి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారని ఉప ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది.

## కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ

# సూచనలే పాటిస్తాం




**హైదరాబాద్, మహా:** కాళేశ్వరంపై బీఆర్ఎస్ నేతలు అవాస్తవాలు చెబుతున్నారని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఈ 3 బ్యారేజీల్లో నీరు నింపకూడదని ఎన్డీఎస్ఏ స్పష్టంగా చెప్పిందన్నారు. శనివారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడిన ఆయన.. బీఆర్ఎస్ చెబుతున్నట్లు కళ్లముందు నీళ్లు పారుతున్నంత మాత్రాన ఎత్తిపోసే అవకాశం ఉంటే బ్యారేజీలు కట్టే అవసరం ఏముందని ప్రశ్నించారు. బ్యారేజీలు కట్టడం అంటేనే పారుతున్న నీళ్లను నిలిపి వాటిని ఎత్తిపోయాల్సి ఉంటుందన్నారు. కన్నెపల్లి దగ్గర ఎత్తిపోతలకు అవకాశమే లేదని 93.5 మీటర్ల ఎత్తులో నీరు నిలిపితేనే ఎత్తిపోతల సాధ్యం అవుతుందన్నారు. ఈటల రాజేందర్ అంటే మాకు గౌరవమే కానీ కాళేశ్వరం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలతో రాజేందర్ తన గౌరవం కోల్పోయారన్నారు. హరీశ్ రావు సూచనలతో ఈటల రాజేందర్ మాట్లాడారని కాళేశ్వరంపై రాజేందర్ అవాస్తవాలు చెప్పారన్నారు. బీఆర్ఎస్ నేతల వాదననే బీజేపీ ఎంపీ ఈటల వినిపించారన్నారు.

**కిలాడీ కమిటీలో రాజేందర్**

కాళేశ్వరానికి శ్రీపాద ఎల్లంపల్లి గుండెకాయ అయితే మేడిగడ్డ వెన్నెముక అని రేవంత్‌రెడ్డి తెలిపారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం భారమవుతుందని గతంలోనే ఇంజినీర్లు చెప్పారని, నాడు భారమవుతుందని చెప్పిన ఇంజినీర్లే ఇప్పుడు సన్నాయినొక్కులు నొక్కుతున్నారని మండిపడ్డారు. ఆ ఇంజినీర్లను జైలుకు పంపనందు వల్లే ఇవాళ ఇలా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. మేడిగడ్డలో లోపాలు ఉన్నాయని ప్రాజెక్టు ప్రారంభించిన 11 నెలల్లోనే లోపాలు ఉన్నట్లు గత ప్రభుత్వంలో ఈఈ రమణారెడ్డి లేఖ రాశాని రేవంత్ రెడ్డి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు సరిచేయకుంటే ఇబ్బందని లేఖలో పేర్కొన్నారన్నారు. నాడు రాసిన లేఖ పట్ల నిర్లక్షఅయం వహించడం వల్లే మేడిగడ్డ కుప్పకూలిందన్నారు. మేడిగడ్డలో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందని ప్లానింగ్, డిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చిందన్నారు. 2022 జులైలో కన్నెపల్లి పంప్ హౌస్ మునిగిపోతే సరిచేయలేదన్నారు. ఎన్డీఎస్ఏ క్షేత్రస్థాయిలో పనిచేసేలా 2021 లో కేంద్రం చట్టం చేసింది. ఎన్డీఎస్ఏ మేడిగడ్డను సందర్శించి.. అందులో నీటి నిల్వ సాధ్యం కాదని చెప్పిందన్నారు. సీడబ్ల్యూసీ ప్రకారమే ప్రాజెక్టుపై ముందుకెళ్లాలని ఎన్డీఎస్ఏ చెప్పింది. 80 వేల పుస్తకాలు చదివిన మేధావుల మాటలుగానీ.. ఖిలాడీ కమిటీల సూచనలు గానీ పట్టించుకోవద్దని ఎన్డీఎస్ఏ చెప్పిందన్నారు. ఎత్తిపోతల అంటే ఏంటో అమెరికాలో చదివిన కేటీఆర్ కు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్డీఎస్ఏ నివేదిక మేరకే కమిటీ వేసి బ్యారేజీల పునరుద్ధరణకు యత్నిస్తామ్నారు. మమ్మల్ని బద్నాం చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలంగాణ ప్రజల ముందు 2 కమిటీలు ఉన్నాయని ఒకటి కిలాజీ కమిటీ రెండోది ఎన్డీఎస్ఏ వేసిన కమిటీ ఉందన్నారు. కిలాడీ కమిటీలో కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు ఈటల సభ్యులుగా ఉన్నారని మండిపడ్డారు.

**హరీష్ రావు నీది ఒక బతుకేనా?**

ఆంధ్రా వాళ్ల మోచేతి నీళ్లు తాగి బతికే హరీశ్‌రావు బతుకు ఒక బతుకేనా అని నిలదీశారు. గురువు కళ్లలో ఆనందం కోసం నేను నీళ్లు వదిలాను అని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పట్టిసీమ కట్టిందే బీఆర్ఎస్ హయాంలో కదా?, పట్టిసీమ కట్టి 105 టీఎంసీలు తరలించినప్పుడు హరీశ్‌రావు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఆంధ్రా విద్యాసంస్థలు శ్రీచైతన్య, నారాయణను బ్లాక్ మెయిల్ చేసి పాలుపోసి, ఆ పైసలతోటి బతికే హరీష్‌రావు నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారన్నారు. తెలివి తక్కువ మాటలు, అతితెలివి మాటలు మాట్లాడుతున్నారని, వాళ్లు బందిపోటు దొంగలకంటే ప్రమాదకరమని, ఇప్పుడు ఈటల కూడా అందులో చేరారని అన్నారు నీళ్లను ఎత్తిపోయాలని ఈటల రాజేందర్ కోరుతున్నారని, ప్రాజెక్టులను ఎన్డీఎస్ఏకు అప్పగిస్తామని, నీళ్లు ఎత్తిపోయాలని ఎన్డీఎస్ఏను కోరండని తెలిపారు. మేమయితే నీళ్లు ఎత్తిపోయమని, అలా చేస్తే భద్రాచలం మునుగుతుందని వెల్లడించారు. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వవిప్ విజయరమణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌పై సింగరేణి దృష్టి

**బెల్లంపల్లిలో పైలట్ ప్రాజెక్టుకు సన్నాహాలు.**




**హైదరాబాద్, మహా:** బొగ్గు వినియోగంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని భవిష్యత్ ఇంధన అవసరాలకు అనుగుణంగా ముందుకు సాగేందుకు సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కీలక చర్యలు చేపడుతోంది. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ సాంకేతికతను అమలు చేసే దిశగా సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్‌లో పైలట్ ప్రాజెక్టును ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ ప్రాజెక్టు ద్వారా భూగర్భంలోనే బొగ్గును వాయు రూపంలోకి మార్చి ఇంధన అవసరాలకు వినియోగించే సాంకేతికత సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో రామగుండం, బెల్లంపల్లి ప్రాంతాల్లోని ఐదు లోతైన బొగ్గు బ్లాక్‌లను సింగరేణి అధికారులు గుర్తించారు. అక్కడి భౌగోళిక పరిస్థితులు, బొగ్గు నాణ్యత, గ్యాసిఫికేషన్‌కు అనుకూల పరిస్థితులపై సమగ్ర అధ్యయనాలు చేపట్టనున్నారు. భీమారం, చెన్నూరు సౌత్, నైనీ ప్రాంతాల్లో భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్‌కు ఉన్న అవకాశాలను శాస్త్రీయంగా పరిశీలించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ సాంకేతికత ద్వారా లోతైన గనుల్లో సంప్రదాయ పద్ధతులతో వెలికితీయడం కష్టమైన బొగ్గును కూడా సమర్థవంతంగా వినియోగించే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు.దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేసేందుకు సింగరేణి ప్రత్యేక బృందాన్ని పంపించనున్నారు. అక్కడి అనుభవాలను పరిశీలించి, సాంకేతిక విధానాలు, నిర్వహణ పద్ధతులు, ఆర్థిక సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించనున్నారు. అదే సమయంలో గ్యాసిఫికేషన్ ఆధారంగా అమ్మోనియం నైట్రేట్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశాలను కూడా సంస్థ పరిశీలిస్తోంది.ఈ ప్రాజెక్టు అమలుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వయబిలిటీ గ్యాప్ ఫండింగ్‌ను వినియోగించుకునే అంశంపై సింగరేణి ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాజెక్టు సాంకేతికంగా విజయవంతం కావడానికి శాస్త్రీయ సంస్థల సహకారం తీసుకోవాలని నిర్ణయించింది. ఈ క్రమంలో కేంద్ర గనుల పరిశోధన సంస్థ సీఎస్ఐఆర్–సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ శాస్త్రవేత్తల సాంకేతిక సహకారంతో ప్రాజెక్టు అమలు ప్రక్రియను ముందుకు తీసుకెళ్లనున్నట్లు తెలుస్తోంది.భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విజయవంతమైతే సింగరేణిలో ఇంధన ఉత్పత్తి, పారిశ్రామిక వినియోగం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీలో కొత్త అవకాశాలు ఏర్పడటంతో పాటు సంస్థ భవిష్యత్ అభివృద్ధికి ఇది కీలక మైలురాయిగా నిలిచే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.

# జూలై 18న యంగ్ టైగర్ బిగ్ అనౌన్స్‌మెంట్ ?



**హైదరాబాద్, మహా :** జూనియర్ ఎన్టీఆర్ ఏం చేయబోతున్నారు. తారక్ ఫ్యాన్స్‌తో పాటుగా సినీ పొలిటికల్ సర్కిల్స్ లో జూ ఎన్టీఆర్ పై భారీ అంచనాలు పెరుగుతున్నాయి. ఏపీ రాజకీయ రణక్షేత్రంలోకి నందమూరి వంశం నుండి మరో నటుడు, ఎన్టీఆర్ మనవడు జూనియర్ ఎన్టీఆర్ రాజకీయ రంగప్రవేశానికి సర్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. విజయ్ విజయం తర్వాత పాలిటిక్స్ పై ఆశలున్న అనేకమంది స్టార్స్ ఆంతరంగికులతో, కుటుంబసభ్యులతో వ్యూహకర్తలతో చర్చిస్తున్నారు. జూనియర్ ఎన్టీఆర్ 2029 టార్గెట్ గా రాజకీయాల్లోకి రావాలని 2009లోనే డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ కు ప్రజలను సమ్మోహపరిచే శక్తి ఉందని, 2009లోనే స్టార్ క్యాంపెయినర్ గా రుజువు చేసుకున్నారు. అయితే ఒకేసారి రాజకీయ రూపం కాకుండా.. అభిమానసంఘాలన్నింటినీ జూలై18న ఏకం చేసి సేవా కార్యక్రమాల క్యాలెండర్ ప్రకటించే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 18న తారక్ కీలక ప్రకటన చేయనున్నారనేది ఆ ప్రచార సారాంశం. తన అభిమాన సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి భారీ స్థాయిలో సేవా కార్యక్రమాలు ప్రారంభించే ఆలోచనలో తారక్ ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారం జోరుగా సాగుతున్నా.. ఇప్పటి వరకు ఈ ప్రచారంపై జూనియర్ ఎన్టీఆర్ క్యాంపు నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. జూనియర్ ఎన్టీఆర్ రాజకీయంగా ఎంట్రీ ఇస్తారని కొంత కాలంగా ప్రచారంలో ఉంది.

**ఇపుడు కాకుంటే ఇంకెపుడు..**

ఏపీలో ఇపుడు కూటమి సర్కార్ కు సరైన ప్రత్యామ్నాయం లేదని, తమిళనాడు తరహాలో ఏపీకి స్పేస్ ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ప్రధానంగా రాజధాని అంశంలో రెండు ప్రభుత్వాల తీరును పరిశీలించడంతోపాటు ఇద్దరి పాలనను కూడా ప్రజలు గమనించారు. ఈ క్రమంలో జూనియర్ ఎన్టీఆర్ తో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పలు సందర్భాల్లో మాట్లాడినట్లు చెబుతున్నారు. బిజెపి పట్ల ఎన్టీఆర్ సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఎన్టీఆర్ కు మిత్రుడే. రాజకీయాలకు రెండు దశాబ్దాలుగా దూరంగా ఉంటున్న తారక్ .. ఇపుడు సరైన సమయంగా భావిస్తున్నారు. దీనికితోడు 20 ఏండ్ల క్రితం తాను పెట్టుకున్న డెడ్ లైన్ కూడా ఇదే కావడం విశేషంగా చెబుతున్నారు. ఎన్టీఆర్ ఎంట్రీ నిజంగా ఉంటుందా.. సేవా కార్యక్రమాలకే పరిమితం అవుతుందా? ఇప్పటికే ఎన్టీఆర్ పేరుతో, బసవతారకం పేరుతో బాలయ్య, భువనేశ్వరి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తండ్రి పేరుతో కార్యక్రమాలు ప్రారంభిస్తారా? తాత పేరుతో మొదలెడతారా? లేక సొంతంగా శ్రీకారం చుడతారా? అన్నది రానున్నరోజుల్లో తెలుస్తుంది

# ఖమేనీ మృతికి ప్రతీకారం తప్పదు

**ఇరాన్ సుప్రీం మొజ్తాబా ఖమేనీ**

**, మహా :** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మృతికి కారణమైన వారిని వదిలిపెట్టబోమని, తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటామని దేశ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ ప్రకటించారు. ఇరాన్ ప్రజల మనోభావాలను ప్రతిబింబించేలా ఈ హెచ్చరిక చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసిన సందేశంలో తన తండ్రి రక్తం చిందడానికి కారణమైన వారిపై గట్టి ప్రతీకారం తప్పదని స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రెండు యుద్ధాల్లో ప్రాణాలు కోల్పోయిన ఇరాన్ ప్రజల తరఫున కూడా తగిన సమాధానం ఇస్తామని హెచ్చరించారు. అయతొల్లా ఖమేనీ అంత్యక్రియలకు పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలకు మొజ్తాబా ఖమేనీ కృతజ్ఞతలు తెలిపారు. శత్రువర్గాలకు స్పష్టమైన సందేశం వెళ్లేలా ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చారని అన్నారు. ఇరాన్, ఇరాక్ నుంచి లక్షలాది మంది ప్రజలు అంత్యక్రియల్లో పాల్గొనడం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. మరోవైపు ఇటీవల గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతలు క్రమంగా సద్దుమణుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఇరాన్‌తో శాంతి ఒప్పందం ముగిసిపోయిందని వ్యాఖ్యానించినప్పటికీ, అమెరికా ఇప్పటికీ చర్చలకు సిద్ధంగానే ఉందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్‌కు చెందిన ప్రతినిధుల బృందం శనివారం ఒమన్‌కు చేరుకుని అమెరికా ప్రతినిధులతో చర్చలు ప్రారంభించినట్లు సమాచారం. హోర్ముజ్ జలసంధిలో చమురు ట్యాంకర్లపై జరిగిన దాడి ఉద్దేశపూర్వకంగా కాదని, అది పొరపాటున జరిగిందని ఇరాన్ ప్రతినిధులు అమెరికా సలహాదారులకు వివరించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇరు దేశాల మధ్య జరుగుతున్న చర్చలు ముందుకు సాగకుండా అడ్డుకోవాలనే ఉద్దేశంతో ఇరాన్‌లోని కొందరు అతివాద వర్గాలు ఈ దాడికి పాల్పడ్డాయని కూడా ఇరాన్ బృందం వివరించినట్లు వార్తలు పేర్కొన్నాయి. ఈ చర్చల ఫలితాలపై అంతర్జాతీయ సమాజం ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా తెలంగాణ

**: అశ్వినీ వైష్ణవ్**

**హైదరాబాద్, మహా :** దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రకటిస్తే.. అందులో తెలంగాణకు 3 దక్కాయని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ కారణంగానే తెలంగాణకు మూడు బుల్లెట్ ట్రైన్స్ దక్కాయని వెల్లడించారు. తెలంగాణ బుల్లెట్ ట్రైన్స్ హబ్‌గా మారబోతోందని అన్నారు. బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి వస్తే.. హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం 1 గంట 10 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి ముంబైకి 2 గంటల 20 నిమిషాలు.. హైదరాబాద్ నుంచి చెన్నయ్‌కి రెండు గంటల్లో వెళ్లవచ్చని చెప్పారు

# డిగ్రీతోనే ఆగొద్దు..

**విశాఖపట్నం, మహా :** యువత కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా పరిశోధనలు, ఆవిష్కరణలు, స్టార్టప్‌ల స్థాపన దిశగా అడుగులు వేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మారుతున్న సాంకేతిక ప్రపంచంలో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే సృజనాత్మకత, నూతన ఆలోచనలు, నైపుణ్యాల పెంపు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయ కన్వెన్షన్ హాల్లో శనివారం నిర్వహించిన జేఎన్‌టీయూజీవీ తొలి స్నాతకోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పట్టభద్రులను ఉద్దేశించి ప్రసంగించారు.

2023, 2024, 2025 విద్యాసంవత్సరాలకు చెందిన ఉత్తీర్ణ విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలు ప్రదానం చేయగా, వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, ఎండోమెంట్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి వి.వి. సుబ్బారావు, నిర్మాణ్ సంస్థ సీఈఓ మయూర్ పట్నాల, పలు విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత కాలంలో డిగ్రీ ఒక్కటే విజయానికి ప్రమాణం కాదని గవర్నర్ స్పష్టం చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని సూచించారు. కృత్రిమ మేధస్సు, డేటా సైన్స్, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతిక రంగాల్లో ప్రావీణ్యం సాధించి, వాటిని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించే దిశగా కృషి చేయాలని సూచించారు.

# బహదూర్‌గూడ రైతులకు పట్టాలు ఎక్కడ?

- ఎన్నికల హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలి
- రైతుల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకోవద్దు
- రైతులకు అండగా బీఆర్ఎస్ ఉంటుందని ప్రదీప్ రెడ్డి వెల్లడి



**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని బహదూర్‌గూడలో పేద రైతుల విలువైన భూములను ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కోలాన్ ప్రదీప్ రెడ్డి ఆరోపించారు. స్థానిక రైతులతో కలిసి శనివారం ఆయన ఆందోళన నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, రెవెన్యూ అధికారులు, మండల ఎమ్మార్వో, ఆర్ఐలు రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, నోటీసులు జారీ చేయకుండా హైడ్రా, పోలీసు సిబ్బందితో కలిసి రైతుల భూముల్లో సర్వే నిర్వహించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు. రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రైతుల ప్రయోజనాలను విస్మరించి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.ఎన్నికల సమయంలో బహదూర్‌గూడ రైతులకు పట్టాలు ఇస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, ఇప్పుడు అదే రైతుల భూములను బలవంతంగా తీసుకునే ప్రయత్నం చేయడం విచారకరమన్నారు. బుల్లెట్ ట్రైన్, బస్ టర్మినల్ పేర్లతో తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవడం సమంజసం కాదన్నారు.భూ సేకరణ చేపట్టాల్సి వస్తే భూసేకరణ చట్టం ప్రకారం ముందుగా నోటీసులు జారీ చేసి, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, చట్టబద్ధంగా సర్వే చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు సమాచారం ఇవ్వకుండా దౌర్జన్యంగా సర్వేలు నిర్వహిస్తే, భూ బాధితులు తమ భూ రికార్డులతో జిల్లా కలెక్టర్‌ను లేదా న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయం పొందాలని సూచించారు.బహదూర్‌గూడ రైతులకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని, వారి హక్కుల పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని ప్రదీప్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రపంచ వాయుసేనల ర్యాంకింగ్స్‌లో భారత్‌కు మూడో స్థానం

ఢిల్లీ, మహా.



ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన వాయుసేనల జాబితాలో భారత వాయుసేన మరోసారి తన ప్రతిభను చాటుకుంది. వరల్డ్ డైరెక్టరీ ఆఫ్ మోడరన్ మిలిటరీ ఎయిర్‌క్రాఫ్ట్ విడుదల చేసిన 2026 గ్లోబల్ ఎయిర్ పవర్ ర్యాంకింగ్స్‌లో భారత వాయుసేన మూడో స్థానాన్ని దక్కించుకుంది. వరుసగా ఐదో ఏడాది కూడా చైనా వాయుసేనను వెనక్కి నెట్టి ఈ ఘనత సాధించడం భారత్ రక్షణ సామర్థ్యానికి మరో గుర్తింపుగా నిలిచింది.

ఈ ర్యాంకింగ్స్‌లో అమెరికా అగ్రస్థానంలో నిలవగా, రష్యా రెండో స్థానాన్ని దక్కించుకుంది. స్వతంత్ర జాతీయ వాయుసేనల పరంగా పరిశీలిస్తే అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలోనే మూడో అత్యంత శక్తిమంతమైన వాయుసేనగా భారత వాయుసేన నిలిచినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారత వాయుసేనకు 69.4 పాయింట్ల ట్రూ వాల్యూ రేటింగ్ లభించగా, చైనా వాయుసేన 63.8 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. విమానాల సంఖ్య మాత్రమే కాకుండా వాటి నాణ్యత, సాంకేతిక సామర్థ్యం, యుద్ధ సన్నద్ధత, పైలట్ల శిక్షణ, నిర్వహణ వ్యవస్థ, లాజిస్టిక్స్, భవిష్యత్ ఆధునికీకరణ ప్రణాళికలు వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులను నిర్ణయించారు. ఈ సమగ్ర మూల్యాంకనంలో భారత వాయుసేన మెరుగైన ప్రతిభ కనబరచడం వల్లే చైనాపై మరోసారి ఆధిక్యం సాధించింది. ప్రస్తుతం భారత వాయుసేన వద్ద సుమారు 1,716 విమానాలు ఉన్నాయి. వీటిలో యుద్ధ విమానాలు, రవాణా విమానాలు, హెలికాప్టర్లు, ప్రత్యేక మిషన్ విమానాలు సమతుల్యంగా ఉండటం వాయుసేన బలాన్ని మరింత పెంచుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, విస్తృత కార్యాచరణ సామర్థ్యం, నిరంతర ఆధునికీకరణ చర్యలు భారత వాయుసేనకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాయి. అయితే భారత వాయుసేన ముందున్న సవాళ్లు కూడా కొనసాగుతున్నాయి. దేశ భద్రతా అవసరాలకు 42 ఫైటర్ స్క్వాడ్రన్లు అవసరమవుతుండగా, ప్రస్తుతం 29 స్క్వాడ్రన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ లోటును అధిగమించేందుకు ప్రభుత్వం 180 తేజస్ ఎంకే-1ఏ యుద్ధ విమానాల కొనుగోలును వేగవంతం చేయడంతో పాటు స్వదేశీ రక్షణ తయారీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తోంది. రానున్న సంవత్సరాల్లో ఆధునిక యుద్ధ విమానాలు, స్వదేశీ సాంకేతికత, మౌలిక సదుపాయాల విస్తరణతో భారత వాయుసేన మరింత శక్తివంతంగా మారే అవకాశాలు ఉన్నాయని రక్షణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నాలా ప్రవాహానికి అడ్డుగా, ప్రహరీ గోడ నిర్మాణం...

- శంషాబాద్ లో ఫిరంగినాలను పరిశీలించిన.. మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు..



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ సర్కిల్ పరిధి సాతాంరాయి రెవిన్యూ పరిధిలోని ఫిరంగి నాళాలను టిడిపి మాజీ ఎమ్మెల్యే పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు శనివారం పరిశీలించారు. నిజాం కాలం నాటి చారిత్రక ప్రాధాన్యత కలిగిన సాగు, త్రాగు నీరు బహుళార్థ సాధకంగా పేరుగాంచిన ఫిరంగి నాలా నేడు శంషాబాద్ లోని సాతాంరాయిలో కబ్జాలకు గురవుతోంది. చందన్‌వెల్లి నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు దాదాపు 85 కిలోమీటర్ల పొడవున ప్రవహించే ఈ కాలువను రాజకీయ నాయకుల అండదండలతో రియల్ ఎస్టేట్ మాఫియా ఫిరంగినాలను ఆక్రమించి నాలాలపై అక్రమ నిర్మాణాలు ప్రహరీలు గోడలను నిర్మిస్తున్నారు. శంషాబాద్ లోని సాతాంరాయి, లోని సదరన్ మెగా టౌన్ షిప్ వెంచర్ పరిధిలో ఫిరంగినాలను టి డి పి ముఖ్య నాయకులతో కలిసి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో హైదరాబాద్ నగరంపై వరద ప్రభావం తగ్గడానికి నిర్మించిన ఫిరంగి నాల చందనవెల్లి గ్రామంలో మొదలుకొని ఇటుపక్క ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు వరకు 84 కిలోమీటర్ల గ్రావిటీ ద్వారా నీరు అందించే ఫిరంగి నాల కాలువపై నేడు అభివృద్ధి పేరుతో భూ బకాసురుల కబంధహస్తాల్లో కనుమరుగుతున్న వైనం, పట్ల విచారం వ్యక్తం చేశారు. సాతాంరాయి లో ఫిరంగినాలను పూడ్చి వేసి, అపర్ణ కన్స్ట్రేషన్, వసుంధర కన్స్ట్రక్షన్స్, బహుళ అంతస్తుల భవనాలను నిర్మించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వనరులపై రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆధిపత్యం నడుస్తుందన్నారు.అభివృద్ధి పేరుతో చెరువులో, కాలువలు, కుంటలు,కనుమరుగవుతున్నాయి. కనుమరుగవుతున్నా ఫిరంగినాలపై రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఎవరైతే ఆక్రమణలకు పాల్పడ్డారో వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకొని ఫిరంగి నాలను పరిరక్షించాలి. భవిష్యత్తు తరాలకు నీరు అందే విధంగా చూడాలని నాలాలో ఎలాంటి మురుగునీరు చేరకుండా పరిరక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.




# విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ

**మందమర్రి, మహా:** మందమర్రి ఎంపీయూపీఎస్ పాఠశాల విద్యార్థులకు మండల విద్యాధికారి (ఎంఈఓ) రాథోడ్ రమేష్ శనివారం యూనిఫాంలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత విద్యా సంవత్సరంలో 23 మంది మాత్రమే ఉన్న విద్యార్థుల సంఖ్య ప్రస్తుతం 135కు చేరడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. డ్రాప్‌అవుట్ అయిన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.జీవో నెం.25 ప్రకారం పాఠశాలల్లో ఉన్న ఉపాధ్యాయుల కొరతను త్వరలోనే భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూ.1.70 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన క్రీడా సామగ్రిని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవ్, దేవ రమేష్, విజయలక్ష్మి, సునీతాదేవి, అనురాధ, అస్మిత, రాజ్యలక్ష్మి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై దుష్ప్రచారం సహించం.

**సీఎం రేవంత్‌రెడ్డి.**

**హైదరాబాద్, మహా.**కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రభుత్వాన్ని దోషిగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం అంశంపై ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు వాస్తవాలకు విరుద్ధమని, మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకే ఆయన మాట్లాడుతున్నారని విమర్శించారు. శనివారం సచివాలయంలో మీడియాతో నిర్వహించిన చిట్ చాట్ లో సీఎం ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎంపీ ఈటల రాజేందర్‌పై వ్యక్తిగతంగా తమకు గౌరవం ఉందని, అయితే కాళేశ్వరం విషయంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ఆ గౌరవాన్నే దెబ్బతీశాయని సీఎం అన్నారు. ప్రజలకు వాస్తవాలను తెలియజేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2019 జూన్ 21న అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారని గుర్తుచేశారు.

మేడిగడ్డ బ్యారేజ్‌లో తలెత్తిన లోపాలు తమ ప్రభుత్వ హయాంలో ఏర్పడినవి కావని, కేసీఆర్ ప్రభుత్వ కాలంలోనే అవి వెలుగులోకి వచ్చాయని సీఎం వివరించారు. ప్రాజెక్టు ప్రారంభమైన పదకొండు నెలలకే నిర్మాణ లోపాలు బయటపడ్డాయని, 2020 మే 18న అప్పటి ఇంజినీర్ రమణారెడ్డి ప్రభుత్వానికి లేఖ రాసి బ్యారేజ్‌లో ఉన్న లోపాలను ప్రస్తావించారని చెప్పారు. ఆ సమయంలోనే ఇంజినీర్లు లోపాలను సరిదిద్దాలని సూచించినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే మేడిగడ్డ బ్యారేజ్‌లో సమస్యలు మరింత తీవ్రమయ్యాయని సీఎం పేర్కొన్నారు. 2022 జులై 14న వరదల ప్రభావంతో కన్నెపల్లి పంప్‌హౌస్ దెబ్బతిందని, ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాలేదని తెలిపారు. అనంతరం 2023 అక్టోబర్ 21న మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడం ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న లోపాలకు నిదర్శనమని వ్యాఖ్యానించారు.

మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటుపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ కమిటీని కూడా కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఏర్పాటు చేశారని రేవంత్‌రెడ్డి గుర్తుచేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నీటి నిల్వకు అనుకూలంగా లేవని ఆ కమిటీ తన ప్రాథమిక, తుది నివేదికల్లో స్పష్టంగా పేర్కొందన్నారు. ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో లోపాలు ఉన్నాయని నిపుణులు అప్పుడే సూచించినా వాటిని ఎందుకు సరిదిద్దలేదని ప్రశ్నించారు.

కాళేశ్వరం అంశంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని సీఎం ఆరోపించారు. కేసీఆర్, హరీశ్‌రావు తమ ప్రభుత్వంపై పదేపదే అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు

# డ్రగ్స్ మాఫియాపై ఈగల్ ఉక్కుపాదం




హైదరాబాద్, మహా: తెలంగాణను డ్రగ్స్ రవాణా కేంద్రంగా మార్చే ప్రయత్నాలపై ఈగల్ ఫోర్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. రాష్ట్ర ఇంటెలిజెన్స్, కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న వరుస ఆపరేషన్లలో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నారు. గత ఏడాదిలో ఏకంగా ఏడు టన్నుల గంజాయిని పట్టుకోవడంతో పాటు, తాజాగా ఛత్తీస్‌గఢ్-మహారాష్ట్ర సరిహద్దులో 385 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని డ్రగ్స్ మాఫియాకు గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. ఈ కేసులో ఈగల్ ఫోర్స్ అధికారులు ఏడు రోజులపాటు నిఘా నిర్వహించి డ్రగ్స్ రవాణా ముఠా కదలికలను నిశితంగా గమనించారు. ఒడిశాలోని జయ్‌పూర్ సమీపంలోని దేవఘాటి ప్రాంతం నుంచి బయలుదేరిన గంజాయి లోడ్‌ను నిరంతరం అనుసరిస్తూ దాని ప్రయాణ మార్గంపై సమాచారాన్ని సేకరించారు. ఈ సమాచారాన్ని కేంద్ర మాదకద్రవ్య నియంత్రణ సంస్థ అధికారులతో పంచుకోవడంతో కోల్‌కతా-ముంబై జాతీయ రహదారిపై వాహనాన్ని అడ్డుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు తరలిస్తున్న ఈ గంజాయి గమ్యస్థానానికి చేరకముందే పట్టుబడింది. ఈ కేసులో రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్ మహదేవ్ భీల్‌ను అరెస్టు చేసిన అధికారులు, డ్రగ్స్ సరఫరా గొలుసుపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ అందించిన కచ్చితమైన నిఘా సమాచారం కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు. డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ ఈగల్ ఫోర్స్ జాతీయ స్థాయిలో సమర్థవంతమైన సంస్థగా గుర్తింపు పొందుతోంది. గతంలో రాంచీలో 500 కిలోలు, ఒడిశాలో మరో 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న అధికారులు, తాజాగా మరో భారీ పట్టివేతతో డ్రగ్స్ మాఫియాపై తమ దూకుడును కొనసాగించారు. రాష్ట్ర సరిహద్దులను దాటి ఇతర రాష్ట్రాల్లోనూ కేంద్ర సంస్థలతో సమన్వయం చేసుకుంటూ నిర్వహిస్తున్న ఆపరేషన్లు ఫలితాలను ఇస్తున్నాయి. డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంతో మరింత కఠిన చర్యలు కొనసాగుతాయని ఈగల్ ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల రవాణా, నిల్వ లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు 1908 హెల్ప్‌లైన్‌కు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ మాఫియాను పూర్తిగా నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగనున్నట్లు వెల్లడించారు.



# రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్.

**హైదరాబాద్, మహా.**

ప్రముఖ అంతర్జాతీయ విమానయాన సంస్థ ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సార్థన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమిరేట్స్ సంస్థ భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జూబ్లీహిల్స్‌లో జరిగిన ఈ భేటీలో తెలంగాణలో విమానయాన రంగ విస్తరణ, కొత్త విమానాశ్రయాల అభివృద్ధి, అంతర్జాతీయ విమాన సర్వీసుల పెంపుపై ఇరువురూ చర్చించారు. తెలంగాణలో విమానయాన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని, రాష్ట్రంలో వరంగల్, ఆదిలాబాద్ జిల్లాల్లో రెండు కొత్త విమానాశ్రయాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రానికి ఎమిరేట్స్ విమాన సర్వీసులను మరింత విస్తరించాలని మహమ్మద్ సార్థన్‌ను కోరారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తికి ఎమిరేట్స్ వైస్ ప్రెసిడెంట్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. హైదరాబాద్‌కు ప్రపంచంలోనే అతిపెద్ద ప్రయాణికుల విమానాల్లో ఒకటైన ఏ-380 విమాన సర్వీసులను ప్రారంభించే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా గచ్చిబౌలిలో ఏర్పాటు చేస్తున్న స్పోర్ట్స్ యూనివర్సిటీకి సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమాల కింద ఎమిరేట్స్ స్పాన్సర్‌షిప్ అందించాలని ముఖ్యమంత్రి కోరారు. దీనిపై కూడా మహమ్మద్ సార్థన్ సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్‌ను అంతర్జాతీయ విమానయాన కేంద్రంగా మరింత బలోపేతం చేయడంతో పాటు రాబోయే రోజుల్లో కొత్త విమానాశ్రయాల ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ అనుసంధానాన్ని మరింత విస్తరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎమిరేట్స్‌తో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఉద్యమకారులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి

**గుర్తింపు కమిటీకి జేఏసీ నేతల వినతి**
**15 కీలక సూచనలు అందజేత**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, వారికి అందించాల్సిన సంక్షేమ చర్యలపై తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కేశవరావుతో తెలంగాణ జేఏసీ స్టీరింగ్ కమిటీ నాయకులు శనివారం సమావేశమయ్యారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు సి.విఠల్, టీఎన్‌జీవో మాజీ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొని పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ 1969 నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారందరినీ గుర్తించాలని కోరారు. ఇప్పటికే గుర్తించిన అమరవీరుల కుటుంబాలతో పాటు మిగిలిన కుటుంబాలకు కూడా ఉద్యోగం లేదా నెలకు రూ.25 వేల పెన్షన్, గృహ వసతి కల్పించాలని సూచించారు. ఉద్యమంలో జైలుకు వెళ్లిన వారికి, ముఖ్యంగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నిర్బంధాల కారణంగా అంగవైకల్యం లేదా ఇతర సమస్యలతో బాధపడుతున్న వారికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.

సకల జనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగ సంఘాల నాయకులను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారిక కార్యక్రమాలకు ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలని, వయోపరిమితి దాటిన ఉద్యమకారులకు రుణాల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ప్రత్యేక రిజర్వేషన్, ఉద్యమకారులకు వైద్య సదుపాయాలు, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు, చట్టబద్ధ కమిషన్‌గా మార్చి బడ్జెట్ లో ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.

స్వాతంత్ర్య సమరయోధులకు కల్పిస్తున్న తరహాలోనే తెలంగాణ ఉద్యమకారులకు కూడా అన్ని సంక్షేమ ప్రయోజనాలు అందించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలని దేవీప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# భారత్ న్యూజిలాండ్ బంధానికి స్నేహం, విశ్వాసమే పునాది.

**ఆక్లాండ్ సభలో ప్రధాని మోదీ.**

**ఢిల్లీ, మహా.** న్యూజిలాండ్ పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ దేశంతో ద్వైపాక్షిక సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్, న్యూజిలాండ్ దేశాల మధ్య సంబంధాలు కేవలం వాణిజ్య పరమైనవి కావని, అవి స్నేహం, విశ్వాసం, ఉమ్మడి విలువల పునాదులపై బలంగా నిర్మితమయ్యాయని స్పష్టం చేశారు. పర్యటనలో భాగంగా రెండో రోజు ఆక్లాండ్‌లో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఈ ప్రసంగంలో న్యూజిలాండ్ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉన్న 'వాకా' (సంప్రదాయ పడవ) గురించి ప్రధాని ఆసక్తికరంగా ప్రస్తావించారు. వాకా అనేది కేవలం ఒక పడవ మాత్రమే కాదని, రెండు దేశాల ఉమ్మడి ప్రయాణానికి అదొక ప్రతీక అని అభివర్ణించారు. భారత్‌న్యూజిలాండ్ భాగస్వామ్యం అనే 'వాకా' ఇప్పుడు సరికొత్త ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా ఉందని, భవిష్యత్తులో ఇరు దేశాల బంధం మరింత బలోపేతం కానుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ భాగస్వామ్య ప్రయాణ విజయానికి తాను కారణం కాదని, ఆక్లాండ్ నుంచి వెల్లింగ్టన్ వరకు, క్రైస్ట్‌చర్చ్ నుంచి క్వీన్స్‌టౌన్ వరకు విస్తరించి ఉన్న ప్రవాస భారతీయులే ఈ స్వర్ణయుగ ప్రయాణానికి అసలైన నావికులని మోదీ కొనియాడారు.

భారతీయుల ప్రతిభను గుర్తించి, వారికి తగిన అవకాశాలు కల్పిస్తున్న అద్భుతమైన దేశం న్యూజిలాండ్ అని మోదీ ప్రశంసించారు. ఎయిర్ న్యూజిలాండ్ సీఈఓ నిఖిల్ రవిశంకర్, మాజీ గవర్నర్ జనరల్ ఆనంద్ సత్యానంద్, క్రికెటర్లు రచిన్ రవీంద్ర, ఇష్ సోధి, అజాజ్ పటేల్ తదితరులు వివిధ రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే, బాంబే హిల్స్, కోరమాండల్, కలకత్తా స్ట్రీట్, ఢిల్లీ క్రెసెంట్, అమృత్‌సర్ స్ట్రీట్ వంటి భారతీయ పేర్లతో న్యూజిలాండ్‌లో ప్రాంతాలు ఉండటం రెండు దేశాల మధ్య ఉన్న చారిత్రక అనుబంధానికి అద్దం పడుతోందన్నారు.

ఈ సందర్భంగా న్యూజిలాండ్‌తో తనకు ఉన్న 30 ఏళ్ల అనుబంధాన్ని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే ఈ దేశాన్ని సందర్శించే అవకాశం వచ్చిందని, అప్పట్లో ఒక స్థానిక పౌరుడు తనకు ప్రేమతో ఇచ్చిన మఫ్లర్, టోపీ, గ్లౌజులను ఇప్పటికీ భద్రంగా దాచుకున్నానని ఆత్మీయంగా పంచుకున్నారు. అందులో న్యూజిలాండ్ ప్రజల ప్రేమను చూసుకుంటున్నానని తెలిపారు. ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను ఉన్నత స్థాయికి చేర్చడంలో ఎన్ఆర్ఐల పాత్ర కీలకమని స్పష్టం చేసిన మోదీ.. ఈ బంధానికి అండగా నిలుస్తున్న న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌తో పాటు ఇతర ప్రభుత్వ ప్రతినిధులు, లేబర్ పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# రాజకీయ చదరంగం ఎత్తుకు పైఎత్తు

**రాజకీయాలు అంటేనే నిరంతర చదరంగం. ఒక అడుగు వేస్తే, ప్రత్యర్థి పది అడుగులు ఆలోచించే పరిస్థితి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీలిమిటేషన్ పై సంచలన ప్రకటన చేశారు. డీలిమిటేషన్ ఖాయమని, 117 స్థానాల్లో గెలవబోతున్నామని ధీమా ప్రదర్శించారు. మరో రెండున్నరేండ్ల తర్వాత జరగబోయే ఎన్నికలపై ఇపుడే సవాళ్ళు విసిరి.. బీఆర్ఎస్ ను ముగ్గులోకి లాగే ప్రయత్నాలు చేస్తున్నాడు. గత ఎన్నికల ముందు సవాళ్ళతోనే బీఆర్ఎస్ కు షాకిచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇపుడు కూడా మరో పదునైన వ్యూహంతో సై అంటున్నారు. 119 నుండి 182 స్థానాలు వస్తాయని ప్రకటించడంతో పాటు బీఆర్ఎస్ సర్వేలను ఎద్దేవా చేయడం వెనుక వ్యూహాలు స్పష్టం. ఏపీలో పవన్ ను టార్గెట్ చేసిన వారిపై చంద్రబాబు ఉక్కుపాదం మోపుతున్నారు. కొత్త సోషల్ మీడియా నియంత్రణ చట్టాలకు పదునుపెడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిణామాలపై ఏఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**





"గోదావరి తల్లిని గడపకు తెస్తామన్న ఆశ.. నేడు మేడిగడ్డ గొంతులో చిక్కుకున్న విషాద శ్వాస. తెలంగాణ భవిష్యత్తును తడుపుతుందనుకున్న కాళేశ్వరం, నేడు రాజకీయ కురుక్షేత్రంలో అగ్ని పరీక్షగా మారింది. ఒకవైపు హరీష్.. మరోవైపు ఈటల.. అధికార పీఠాన్ని అస్థిరపరచాలనే ఆరాటం ఒకరిదైతే, ఎన్డీఎస్ఏ నివేదికల వాస్తవాలతో అవినీతి పాపాలను కడిగేయాలని రేవంత్ చేస్తున్న సమర శంఖం మరొకటి. ప్రాజెక్టుల పునాదుల్లో పగుళ్లు కాదు, ఇది రాజకీయ విశ్వసనీయతకు పరీక్ష.. జలసిరి కోసం జరిగిన యజ్ఞంలో అపశృతులు ఎవరివో, ప్రజాధనం కొల్లగొట్టిన రాబందులు ఎవరో తేల్చే 'నిజాయితీ' నిశ్శబ్దంగా రణరంగంలా మారుతోంది."

ఖమ్మం జిల్లా చింతకానిలో జరిగిన 'రైతు ఆశీర్వాద సభ' వేదికగా సీఎం రేవంత్ రెడ్డి డీలిమిటేషన్ తో పాటు మేడిగడ్డ నింపాలన్న డిమాండ్లపై స్పందించిన తీరు రాజకీయ వేడిని రగిలిస్తోంది.

తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 119 నుండి 182కు, లోక్ సభ సీట్లు 17 నుండి 26కు పెరిగే అవకాశం ఉందని సీఎం చేసిన వ్యాఖ్యలు కేవలం ఊహాగానాలు కావు. కేంద్రం రాబోయే రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయబోతోందనేది స్పష్టమవుతోంది. సౌత్ కు అన్యాయం జరుగుతుందని ఎంత వాదనాలు వినిపించినా, కేంద్రం మెడమీద కత్తిపెట్టి చేసుకోవడం ఖాయమని రేవంత్ వ్యాఖ్యాల సారాంశంగా కనబడుతోంది. రాబోయే 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్తున్నారు. "కురుక్షేత్రం" అంటూ బీఆర్ఎస్‌పై ఆయన చేస్తున్న విమర్శలు ఆ పార్టీని మరింత రాజకీయంగా దెబ్బతీయడమే లక్ష్యంగా కనిపిస్తున్నాయి.సీట్లు పెరిగితే వచ్చే కొత్త నియోజకవర్గాల్లో పట్టు కోసం ఇప్పటి నుంచే పార్టీలను సర్దుబాటు చేసుకోవడం అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీలకు పెద్ద సవాలుగా మారనుంది.

తెలంగాణ రాజకీయ యవనికపై ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు ఒక పెద్ద 'ప్రశ్నార్థకం'. మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుతో మొదలైన ఈ 'జల' వివాదం, ఇప్పుడు పాలక, ప్రతిపక్షాల మధ్య అగ్గి రాజేస్తోంది. ఒకవైపు హరీష్ రావు, మరోవైపు ఈటల రాజేందర్ చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో చేస్తున్న ప్రతిదాడి రాజకీయాల్లో నిప్పులు చెరుగుతోంది. నీటిని ఎత్తిపోయడం లేదని, ప్రాజెక్టును నిర్వీర్యం చేస్తున్నారని బీఆర్ఎస్, బీజేపీ నేతలు చేస్తున్న విమర్శలను సీఎం రేవంత్ రెడ్డి సమర్థవంతంగా తిప్పికొట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవినీతిని, ఇంజనీరింగ్ వైఫల్యాలను సీఎం అంకెల్లో సహా వివరించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల దుస్థితికి గత ప్రభుత్వమే కారణమని ఆయన స్పష్టం చేశారు. కాళేశ్వరం అనేది తెలంగాణకు గర్వకారణం కావాల్సింది, కానీ ఇప్పుడు అది ఒక 'ఆర్థిక ఉగ్రవాద' నిదర్శనంగా మారింది. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, ఎన్డీఎస్ఏ నివేదికలను పక్కనపెట్టి ప్రాజెక్టును ప్రమాదంలోకి నెట్టడం సరికాదని సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వాదనలో బలమైన రాజకీయ వ్యూహం ఉంది. చివరకు విజయం ఎవరిది? ప్రజల దాహార్తి తీర్చే ప్రాజెక్టు పునరుద్ధరణ వైపా లేక రాజకీయ విమర్శల వైపా అన్నది కాలమే నిర్ణయిస్తుంది.

**యాక్టివ్ గా నేతలు..**

కవిత బొగ్గుబాయి బాట పేరుతో కోల్ బెల్ట్ లో పర్యటిస్తూ 1400కోట్ల బీఆర్ఎస్ సొమ్ము సీజ్ చేయాలని, రూ.188కోట్లతో ఇంగ్లీష్ పత్రిక కూడా కొన్నారంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ కంటిన్యూగా మేడిగడ్డ, ఇతర అంశాలపై విమర్శలు చేసక్తుండగా, ఈటల రాజేందర్ కూడా మేడిగడ్డ నీళ్ళు ఎత్తిపోయాలని డిమాండ్ చేయడంతో ఈ ఎపిసోడ్ మరో మలుపు తిరిగింది. ఈటల ఎంట్రీని బేస్ చేసుకుని సీఎం రేవంత్ రెడ్డి బంతిని కేంద్రం కోర్టులోకి నెట్టారు. ఈటల బీఆర్ఎస్ కు దగ్గరగా ఉన్నారన్న సిగ్నల్ ను ప్రజల్లోకి పంపడంతో పాటు బిజెపి పార్టీలో, హైకమాండ్ వద్ద కూడా ఈటల ను ఫిక్స్ చేసినట్లుగా కనబడుతోంది. ఎత్తులు, పై ఎత్తులతో రాజకీయ రణతంత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రక్తికట్టిస్తున్నట్లు కనబడుతోంది. ఖమ్మం సభలో ఆయన చేసిన ప్రసంగం ఎన్నికల ప్రసంగాన్ని తలపించింది.

**సోషల్ మీడియా దుర్వినియోగంపై 'ఉక్కుపాదం'**
**ఏపీలో మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో,**
**చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సంచలనం.**

రాజకీయ నాయకులపై, మహిళలపై, ప్రజా ప్రతినిధులపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న అసభ్యకర ప్రచారాలు, వ్యక్తిత్వ హననంపై ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఇది కేవలం కక్షసాధింపు కాదు, వ్యవస్థను కాపాడుకునే ప్రయత్నమని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఏపీలో వ్యక్తిగత దూషణలు, వ్యక్తిత్వ హననాలు.. ఒక స్థాయిని మించి జరుగుతున్నాయి. దీనిని కట్టడిచేయడానికి ఏపీ సర్కారు బలంగా పూనుకున్నట్లు కనబడుతోంది. ఏపీలో సైబర్ క్రైమ్ కేసులు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రత్యేక ఐజీ స్థాయి అధికారి పర్యవేక్షణలో స్పెషల్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయడం, సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్ తీసుకురావడం వెనుక ఉన్న ఉద్దేశ్యం స్పష్టంగా కనబడుతోంది. ఏపీని అరాచక ప్రచారాల నుండి కాపాడటమే. మరోవైపు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లక్ష్యంగా జరిగిన పరిణామాలను ప్రభుత్వం అత్యంత తీవ్రంగా తీసుకుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే సంకేతాలను ప్రభుత్వం బలంగా పంపిస్తోంది. పవన్ కళ్యాణ్ ను లక్ష్యంగా చేసుకుని దురుద్దేశపూర్వక ప్రచారం చేస్తున్నవారి పనిపట్టాలని చంద్రబాబు డిసైడ్ అయినట్లు కనబడుతోంది.



# రాముడే సాక్షి



ఒట్టు... ఒట్టంటే ఒట్టు... ఈ ఒట్టు తీసి గట్టుమీద పెట్టడ ఉండదు. ఇది భద్రాద్రి రామన్న సాక్షిగా పెట్టిన ఒట్టు. ఈ ఒట్టు పెట్టింది ఎవరో అనామకులు కాదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి. ఖమ్మం జిల్లా పర్యటనలో ఆయన ఓ రేంజ్ లో బీఆర్ఎస్ కు వార్నింగ్ ఇచ్చేశారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబాన్ని ఏకంగా కౌరవ వంశంతో కలిపేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను కురుక్షేత్ర సంగ్రామంతో పోల్చిన సీఎం ఈ యుద్ధంలో కల్వకుంట్ల కుటుంబం నామ రూపాలు లేకుండా పోతుందని చెప్పేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓ వైపు బీఆర్ఎస్ డబ్బు మూటలతో మరో వైపు బీజేపీ అంగ అర్థబలంతో బరిలోకి దిగాయని, అప్పట్లో మీడియా మిత్రులు ఈ విషయం తన దృష్టికి తెచ్చారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ ఎన్ని ఎత్తులు వేసినా కాంగ్రెస్ 65 సీట్లు గెల్చుకుని తీరుతుందని ఆ రోజు తాను చెప్పిన మాటలు నిజం అయ్యాయన్నారు. ఇప్పుడు అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 66 సీట్లుగా గుర్తు చేశారు. ఇప్పుడు అదే చెప్తున్నా, మళ్ళీ రాసుకోండి. వచ్చే ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం సాధిస్తుంది. నో డౌట్ అంటూ ధీమాగా చెప్పేశారు. అక్కడితో సీఎం రేవంత్ ఆగలేదు. కాంగ్రెస్ ఎన్ని శాసనసభ స్థానాలు గెలుస్తుందో కూడా క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 182 కు చేరుకోబోతున్నాయని, ఇందులో 117 కాంగ్రెస్ ఖాతాలో చేరుతాయని స్పష్టత ఇచ్చారు. ఇది భద్రాద్రి రాముడుపై ఆన. ఇందులో మరో అనుమానం లేదు. బీఆర్ఎస్ కు విపక్ష హోదా కూడా రావటం కష్టం అంటూ భవిష్యత్ రాజకీయ చిట్టా వివరించారు. సీఎం రేవంత్ కు ఇంత నమ్మకం ఎలా వచ్చింది? ఓ వైపు బీఆర్ఎస్ కాంగ్రెస్ సర్కార్ పై ముప్పేట దాడి చేస్తోంది. తెలంగాణ బీజేపీ గెలుపే లక్ష్యంగా వ్యూహం రూపొందిస్తోంది. ఈ రెండు పార్టీలను సీఎం రేవంత్ ఎలా ఎదుర్కొని ముందుకు వెడతారు. ఈ సందేహం చాలా మందికి వుంది. దీనికి ఓ మాస్టర్ ప్లాన్ సీఎం రేవంత్ దగ్గర ఉన్నట్టు ఆయన మాటలలో అర్థం అవుతోంది.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 30 నెలలు అవుతోంది. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా అవసరాలపై పూర్తి దృష్టి పెట్టారు. అధికారులు, మంత్రులను ప్రజా వేదిక, ప్రజా ద్వారా ప్రజల ముందుకు తీసుకొని వచ్చారు. సమస్యల పరిష్కారానికి మార్గం వేశారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలు అమలు చేస్తూనే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు శ్రీకారం చుట్టారు. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రేషన్ కార్డుల మంజూరు, రైతు సంక్షేమ పథకాలు ఇలా ఒకదాని వెంట మరొకటి అమలు చేస్తూ వస్తున్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామన్న కాంగ్రెస్ వేయి మంది మహిళలను బస్సులకు ఓనర్లను కూడా చేసింది. సీఎం రేవంత్ మాటల్లో చెప్పాలంటే తెలంగాణలో దాదాపుగా ప్రతీ ఇంటికి కాంగ్రెస్ పథకాల లబ్ధిదారులు వున్నారు. వారంతా కాంగ్రెస్ కు ఓటు వేస్తే... వేస్తే ఏమిటీ, వేస్తారు అంటూ సీఎం రేవంత్ గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఈ లెక్కలతోనే ఆయన ఇప్పుడు వచ్చే అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో చెప్పేస్తున్నారు. దీనికి మరో బలమైన కారణం కూడా వుంది. కాంగ్రెస్ పాలనపై ఆ పార్టీ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో కూడా కాంగ్రెస్ కు అనుకూల పరిస్థితి ఉన్నట్టు తేలిందని సీఎం అంటున్నారు. ఈ సర్వేలో ఏం తేలిందో తెలికుండానే బీఆర్ఎస్ నేతలు వచ్చే ఎన్నికల్లో కారు జోరు ఉంటుందని భుజాలు ఎగుర వేస్తున్నారని సీఎం రేవంత్ ఏద్దేవా చేశారు. ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలీదు. తెలంగాణలో ఎన్ని అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయో స్పష్టత రాలేదు. కాంగ్రెస్ నిర్వహించిన సర్వే రిపోర్ట్ ఏమిటో వాళ్ళకు తెలీదు. ఇక వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఏ ఎజెండాతో ప్రజల్లోకి వెళ్తుందో బీఆర్ఎస్ నేతలకు అవగాహన లేదు. ఇవేమి లేకుండా ఇప్పుడే తెలంగాణలో మళ్ళీ తామే అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారంటూ విరుచుకుపడ్డారు.

మాజీ సీఎం కేసీఆర్ ను గట్టిగా టార్గెట్ చేసుకొని సీఎం రేవంత్ దాడి చేసిన తీరు బీఆర్ఎస్ కు గట్టిగా తగిలే అంశమే. కేసీఆర్ పాపాల భైరవుడని, ఆయనను ఇక బయటకు రాకుండా ఫామ్ హౌస్ లో ప్రజలు బంధించి వేశారని సీఎం రేవంత్ అంటున్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో తెలంగాణ విధ్వంసం ఓ రేంజ్ లో జరిగిందని, అప్పులు కుప్పలుగా పేరుకుపోయాయని వివరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సమయస్ఫూర్తితో చక్కబెడుతున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ ఎత్తులు, జిత్తులు ఇక సాగవన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు ఆ పార్టీలో ఉండరని రేవంత్ చెబుతున్నారు. బీజేపీలోకి జంప్ అయ్యేందుకు ఢిల్లీ బీజేపీ అగ్ర నేతలతో హరీష్ రావు మంతనాలు జరుపుతున్నారని రేవంత్ గట్టిగానే చెబుతున్నారు. బీజేపీ నేతలతో హరీష్ రావు టచ్ లో వున్నారో, లేదో భద్రాచలం రాముడిపైన ప్రమాణం చేసి చెప్పాలని రేవంత్ సవాల్ విసిరారు. రేవంత్ ఆరోపణలను హరీష్ రావు కొట్టి పారేస్తున్నారు. పార్టీలు మారే సంస్కృతి తమది కాదని, అది రేవంత్ కే సాధ్యమని అంటున్నారు. నిప్పు లేనిదే పొగ రాదు. సీఎం హోదాలో వున్న నేత ఓ బహిరంగ సభలో చేసిన వ్యాఖ్యల్లో ఎంతో కొంత నిజం ఉండక పోదు అంటున్నారు జనాలు. ఇక వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో నెగ్గుకు వస్తుందని రేవంత్ చేసిన ప్రకటనపైన ఇప్పుడు తెలంగాణలో చర్చ మొదలైంది. ఆయన అంత ధీమాగా కాంగ్రెస్ విజయం గురించి పదే పదే చెప్పటం వెనుక వున్న రహస్యం ఏమిటీ? ఇప్పటికే ఎన్నికల గెలుపు వ్యూహం రెడీ చేసారా? ముమ్మందు ఆ ఫార్ములాతోనే రేవంత్ ముందుకు వెళ్ళాలి అనుకుంటున్నారా? ఇదే ఇప్పుడు రాజకీయ పరిశీలకులు అధ్యాయం చేస్తున్నారు.

ప్రతిపక్షాల బలహీనతలే కాంగ్రెస్ పార్టీకి ఆయుధం అవుతున్నట్టు కనిపిస్తోంది. ముఖ్యంగా రేవంత్ రెడ్డి సర్కార్ పైన అదే పనిగా దాడి చేస్తున్న బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీష్ రావులను టార్గెట్ చేసుకొని సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు రాజకీయ సంచలనం రేపుతున్నాయి. హరీష్ రావు బీజేపీ నేతలతో టచ్ లో వున్నారని సీఎం ఓపెన్ గా అనేశారు. ఈ ఆరోపణలు సీఎం ఉద్దేశ్యపూర్వకంగా చేస్తున్నవే అంటున్నారు బీఆర్ఎస్ నేతలు. అయితే గతం ఓ సారి గమనిస్తే సీఎం ఆరోపణల వెనుక ఏదో నిజం దాగి ఉన్నట్టు కొందరి అనుమానం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూడా హరీష్ రావు మీద ఇలాంటి ఆరోపణలు వదంతులు వచ్చాయి. కేసీఆర్ మంత్రి వర్గంలో కేటీఆర్, హరీష్ రావులకు అప్పట్లో బెర్త్ లభించలేదు. ఆ సమయంలో హరీష్ రావు బీజేపీలోకి వెళ్లేందుకు ప్రయత్నం చేస్తున్నారనే ప్రచారం జోరుగా సాగింది. దాన్ని హరీష్ రావు తిప్పికొట్టినా ఇప్పుడు మళ్ళీ అదే టాక్ సీఎం నోటి నుంచి వచ్చింది. ఆషామాషీగా ఈ మాటలు ఆయన అన్నారా? లేక హరీష్ రావు వాస్తవంగానే బీజేపీ నేతలతో టచ్ లో వున్నారా? అనే చర్చ మాత్రం ఇప్పుడు మొదలైంది. సీఎం వ్యాఖ్యలపైన హరీష్ రావు కౌంటర్ ఇచ్చారు. భద్రాద్రి రాముడిపై ప్రమాణం చేయాలనే సీఎం సవాల్ కు ఓ సినిమాలో హీరో వాడిన డైలాగ్ ను రేవంత్ పైన హరీష్ రావు ప్రయోగించారు. ఒట్టేసి ఓ మాట, ఒట్టేయకుండా మరో మాట తాను చెప్పానని సెటైర్ విసిరారు. వీరిద్దరూ భద్రాద్రి రామన్ననే సాక్షిగా పెట్టుకోవటం మరో విశేషం. ఖమ్మం జిల్లాలో రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, కేసీఆర్ పైన చేసిన కామెంట్స్ పై ఇప్పుడు మరోసారి పొలిటికల్ హీట్ పెరిగింది.

రాజకీయ పార్టీలకు అంతిమ లక్ష్యం అధికారం. అధికారం ఉంటేనే పదవులు వస్తాయి. పదవులు హోదా తెస్తాయి. సమాజంలో పలుకుబడి ఉంటుంది. మాట చెలామణి అవుతుంది. ఇక వీటితో పాటే ఆర్థిక పరిపూర్ణత లభిస్తుంది. అందుకే అధికారం కోసం నేతలు ఇంతగా ఆరాటం పడుతుంటారు. రాజకీయాల్లో ఎత్తుకు పై ఎత్తు వేస్తూ అవకాశం కోసం ఎదురు చూడక తప్పదు. కొన్నిసార్లు అదృష్టం కూడా తోడు అవ్వాలి. గెలుపు, ఓటమి ఎదురుకోవాలి. సన్మానాలు, అవమానాలు ఆశ్వాదించాలి. వచ్చిన అవకాశం సద్వినియోగం చేసుకోవాలి. అప్పడే రాజకీయంలో నెట్టుకు రావటం సాధ్యమవుతుంది. ఇవి అన్నీ సీఎం రేవంత్ రెడ్డి జీవితంలో ఎదురైన నేపథ్యంలోనే ఆయన ఉన్నత స్థాయికి ఎదిగారు. సీఎం అయ్యారు. ఆ హోదాలో ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నారు. ఇవి వచ్చే ఎన్నికల్లో ఓట్లు రాలుస్తాయని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. ఆ దిశగా ప్రయత్నం చేస్తున్నారు. ఇటు బీఆర్ఎస్ నేతలు కూడా వచ్చిన అన్నీ అవకాశాలు వదలకుండా పట్టు బిగిస్తున్నారు. బీజేపీ నేతలు అదే దారిలో నడుస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం ఎవ్వరు ఆపలేరు అంటున్నారు సీఎం. ఈ సారి తిరిగి కేసీఆర్ సీఎం అవుతారు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు బీఆర్ఎస్ నాయకులు. తెలంగాణలో వచ్చేది డబుల్ ఇంజిన్ సర్కార్ అంటున్నారు కమలనాథులు. ఎవరి ఆశలు వారివి. ఎవరి అంచనాలు వారివి. కానీ సగటు ఓటరు మాత్రం మోనం ఈ రాజకీయ తంతును చూస్తున్నాడు. ఓటరు ఎటు మొగ్గుతాడో, ఎవరి అంచనాలు ఎంత మేరకు నిజం అవుతాయో చూడాలి అంటే మరో రెండేళ్లు ఆగాలి. అప్పటి వరకు నేతలు గెలుపు మాదే అంటే మాదే అనుకునే ఛాలెంజ్ లు చూస్తూనే ఉండాలి. ఇది భద్రాచలం రాములవారి సాక్షిగా జరిగే రాజకీయ రచ్చ.




**జీ. వెంకటరమణ.**
**సీనియర్ జర్నలిస్ట్.**



## ఎస్ ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** గడువులోగా ఎన్యుమరేషన్ ఫారాలు నింపి బీఎల్వోలకు అందించి డిజిటలైజేషన్ పూర్తి చేసేలా బీఎల్ఏ2లు, సూపర్ వైజర్లు, పార్టీ మండలాధ్యక్షులు కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సూచించారు.శనివారం పార్టీ శ్రేణులతో కలిసి పట్టణంలోని పలు వార్డులలో జరగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. పట్టణంలోని 42 వవార్డు రిక్షాకాలనీ 32 వార్డు మాసూద్ చౌక్, ఖానాపూర్ 23వ వార్డు తాటిగూడ, 21వ వార్డు క్రాంతినగర్ కానీలలో ఆయన పర్యటించారు.ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో ఉన్న సందేహాలను నివృత్తి చేసారు. బీఎల్వోలతో అనుసంధానంగా పనిచేస్తూ నింపిన వెంటనే డిజిటలైజేషన్ చేయించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, లీగల్ సెల్ చైర్మన్ మంగేష్,నాయకులు సుధాకర్ గౌడ్, బూర్ల శంకరయ్య, వెంకన్న యాదవ్, ,అనిల్, సాహెబ్ రావు ఆయా వార్డు నాయకులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారానికి ప్రజా దర్బార్ : కంది శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణం లోని ప్రజా సేవ భవన్ లో ఆదివారం ప్రజా దర్బార్ నిర్వహించారు.అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలు పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలు తమ సమస్యల పై కంది శ్రీనివాస రెడ్డి కి వినతి పత్రాలు అందించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్,మహబూబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఖిజార్ పాషా,మండల అధ్యక్షులు, రూప్ రావు,వెంకన్న యాదవ్,బాపు రావు,లీగల్ సెల్ చైర్మన్ మంగేష్, జిల్లా మైనార్టీ చైర్మన్ షాహిద్ అలీనాయకులు లోక ప్రవీణ్ రెడ్డి ,శాంతన్ రావు, రషీద్, పర్వేజ్, బూర్ల శంకరయ్య, మల్లయ్య యాదవ్, రాందాస్ నాక్లే, సుధాకర్ గౌడ్, ఖలీం, అల్చేట్టి నాగన్న, సింగిరెడ్డి రామ్ రెడ్డి, నిమ్మల గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇల్లును సందర్శించిన కంది శ్రీనివాస రెడ్డి

- దంపతులకు కానుక అందించి శుభాకాంక్షలు

**ఆదిలాబాద్ మహా:** ఇందిరమ్మ ఇండ్లతో తెలంగాణ ప్రభుత్వం పేదవాడి సొతింటి కల నెరవేర్చుతుందని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతి నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులు కిషోర్ రమాదేవి దంపతుల నివాసాన్ని సందర్శించారు. దంపతులకు శుభాకాంక్షలు తెలిపి నూతన వస్త్రాలు బహుకరించారు. ఆయన వెంట గిమ్మ సంతోష్ రావు, లీగల్ సెల్ చైర్మన్ మంగేష్ దేవ్ తడే , మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, నాయకులు సుధాకర్ గౌడ్,బూర్ల శంకరయ్య, వెంకన్న యాదవ్, అనిల్, సాహెబ్ రావు తదితరులున్నారు.



## అప్పాయిగూడెంలో బోర్లకు పూడితీత

**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం, అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ లో శనివారం చేతి పంపులను వాడుకలతో తేవటానికి పూడికతీత మరమ్మత్తులు చేపట్టినట్లు సర్పంచ్ దండు ప్రవీణ తెలిపారు. అప్పాయిగూడెం, తులిస్య తండా, భిక్య తండా గ్రామాలలో ఉన్న చేతి పంపులకు ఫ్లస్సింగ్ నిర్వహించి, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టడం జరిగిందన్నారు. దీర్ఘకాలంగా నెలకొన్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. బోర్ల మరమ్మత్తులతో స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందుబాటులోకి వచ్చి,ఎంతో కాలంగా ఉన్న మంచినీటి సమస్యకు స్వస్థి పలికటం జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్, ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి, వార్డు సభ్యులు జర్పుల శాలి, వాంకుడోత్ రమేష్, అజ్మీరా మమత, మాలోత్ విజయ, బోర్ మెకానిక్ మోహన్ రావు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పంచాయతీ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ఎన్యుమరేషన్ ఫాం నింపక పోతే ఓటు రద్దయ్యే ప్రమాదం


- మన ఓట్లు కాపాడుకోవడం మన బాధ్యత
- బీఎల్వోలు, సూపర్వైజర్లు , మండల అధ్యక్షులు పార్టీ శ్రేణులు జాగ్రత్తగా వ్యవహరించాలి
- ఒక్క ఓటు కూడా పోవద్దు
- సమీక్షా సమావేశంలో కంది శ్రీనివాస రెడ్డి సూచనలు

**ఆదిలాబాద్ మహా :** బిఎల్ఎ2లు బిఎల్ఓ లతో పరస్పర సహకారంతో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాలు నింపి డిజిటలైజేషన్ పూర్తయ్యేలా కృషి చేయాలని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి సూచించారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన బిఎల్ఏ2లు, సూపర్వైజర్లు మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కౌన్సిలర్ కంటెస్టెంట్ అభ్యర్థులు,సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎస్ఐఆర్ ప్రక్రియ స్టేటస్ రిపోర్ట్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆయా వార్డులు గ్రామాల బిఎల్ఎలు ఫారాలు నింపడం పూర్తయినా ఆన్లైన్ ప్రక్రియ నిదానంగా సాగుతుందని కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియలో ఫారాలు నింపకపోతే ఓటు పోయే ప్రమాదం ఉందని కంది శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎలు మండల అధ్యక్షులు మన అనుకూల ఓటు ఒక్కటి కూడా పోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. బతికున్న ప్రతి ఓటరు యొక్క ఎన్యూమరేషన్ ఫామ్ నింపేలా తగు జాగ్రత్తలు వహించాలన్నారు. మన ఓటు పోతే బతికున్న చనిపోయినట్టేనని అన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఓటు వేస్తున్నా ఈసారి ప్రక్రియ లో తిరిగి ఓటు నమోదు చేసుకోకపోతే ఆ ఓటు పోయే ప్రమాదం ఉందన్నారు. ఓటు కాపాడడం కేవలం బిఎల్ఎ ల పాత్ర మాత్రమే కాకుండా అందరిపై ఉందన్నారు. ఇప్పటివరకు నియోజకవర్గ వ్యాప్తంగా 35% ఎన్యుమరేషన్ ఫారాలు నింపడం పూర్తయితే కేవలం 21.75% మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయిందని తెలిపారు. మండలాల వారీగా జైనథ్లో అత్యధికంగా 42.67% సాత్నాల 36.35% బేల 34.15% బోరజ్, 28.29% ఆదిలాబాద్ రూరల్ మండలం 27.8% ఉంటే ఆదిలాబాద్ అర్బన్ మావల మండలాలలో అతి తక్కువ శాతం పూర్తయిందన్నారు. ఆదిలాబాద్ అర్బన్ లో 14.27 మావలలో 10.4% మాత్రమే వారాలు నింపి డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయిందన్నారు .కాబట్టి మిగిలి ఉన్న ఈ 13 రోజులైనా బిఎల్ఈ లతో పాటు సూపర్వైజర్లు మండల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు దీనిపై దృష్టి సారించి వంద శాతం పూర్తయ్యేలా కృషి చేయాలన్నారు. మన ఓట్లతోపాటు మన ఓటర్ల రక్షణ బాధ్యతగా భావించి ఓట్లు కాపాడుకోవాలని సూచించారు. భవిష్యత్తులో ఏ పదవికైన పోటీ చేసి గెలవాలంటే మన ఓటు తో పాటు మన మద్దతుదారుల ఓట్లు చాలా కీలకమన్నారు .ఇది ఒక ఫైనల్ మ్యాచ్ లాంటిదని ఇందులో కచ్చితంగా గెలవాలని సూచించారు. ఒక్క ఓటు పోయిన భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు దారుల ఓట్లు తొలగించేలా కేంద్రం ఎలక్షన్ కమిషన్ తో కలిసి చేసిన ఈ కుట్రను ఓటు నమోదు చేసి ఎదుర్కోవాలన్నారు. ఈ 13 రోజులు జాబితా సవరణ పై పూర్తి స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు.ఆన్ లైన్ నమోదు పై అవగాహన ఉన్నవారు ఆన్ లైన్ లో తమ ఎన్యుమేషన్ ఫామ్స్ నింపి సమర్పించాలని సూచించారు.కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్,మహబూబ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఖిజార్ పాషా,మండల అధ్యక్షులు, రూప్ రావు,వెంకన్న యాదవ్,బాపు రావు,లీగల్ సెల్ చైర్మన్ మంగేష్, జిల్లా మైనార్టీ చైర్మన్ షాహిద్ అలీ నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి ,శాంతన్ రావు, రషీద్, పర్వేజ్, బూర్ల శంకరయ్య, మల్లయ్య యాదవ్, రాందాస్ నాక్లే, సుధాకర్ గౌడ్, ఖలీం, అల్చేట్టి నాగన్న, సింగిరెడ్డి రామ్ రెడ్డి, నిమ్మల గౌతమ్ రెడ్డి, సంటెన్న, చిట్యాల భూమన్న, రాంకుమార్, పోతా రెడ్డి, గొర్ల రాము, భూమన్న,శామ్ రావు, నానాజీ వైద్య, సాగర్ టాక్రె, గట్లే వార్ రవి, తమ్మల చందు, అశోక్,కావేటి జ్యోతి, జమున బాయి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులపై బాసర జోన్ డీఐజీ ప్రశంసలు




**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పర్యటనకు వచ్చిన బాసర జోన్ డీఐజీ ఆర్ భాస్కరన్ కు జిల్లా ఐపీఎస్ అధికారులు ఘన స్వాగతంల పలికారు. శనివారం పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఆవరణలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తో పాటు అడిషనల్ ఎస్పీలు మౌనిక , ఉట్నూర్ ఏఎస్పీ రుత్విక్ సాయి పూలమొక్కలు అందజేసి సాదరంగా స్వాగతం పలికారు. సాయుధ పోలీసు సిబ్బంది చే గౌరవ వందనాన్ని డీఐజీ స్వీకరించారు. అనంతరం జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్ఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లాలోని శాంతిభద్రతల పరిస్థితులు, నేర నియంత్రణ చర్యలు, పోలీస్ స్టేషన్ల పనితీరు, బందోబస్తు నిర్వహణ, గతంలో జరిగిన ముఖ్య సంఘటనలు, ప్రత్యేక డ్రైవ్‌లు, పోలీసింగ్ విధానాలపై సమగ్రంగా వివరించారు.జిల్లాలో పోలీసుల పనితీరు అభినందనీయంగా ఉందని, ఇదే క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగాలని డీఐజీ అన్నారు. ప్రతి ఒక్క ఎస్ హెచ్ ఓ తో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేసుకుంటూ నేరాలను ముందస్తుగా గుర్తించి సమర్థవంతంగా నియంత్రించాలని తెలిపారు. ప్రతి అధికారి బేసిక్ పోలీసింగ్‌తో పాటు విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల్లో భద్రతాభావం పెంపొందించేలా విధులు నిర్వహించాలని సూచించారు.ప్రోయాక్టివ్ పోలీసింగ్ ద్వారా సమస్యలు తలెత్తకముందే చర్యలు చేపట్టాలని, సోషల్ మీడియాపై నిరంతర నిఘా కొనసాగిస్తూ రెచ్చగొట్టే పోస్టులు, తప్పుడు ప్రచారం, విద్వేషపూరిత సందేశాలపై, మత ఘర్షణలు తలెత్తకుండా వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రతి ఎస్‌హెచ్ఓ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని తన పరిధిలో నేర నియంత్రణలో ప్రత్యేక గుర్తింపు సాధించాలని సూచించారు. ప్రజలందరితో సమానంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా పనిచేయాలని అన్నారు. జిల్లా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ రవాణా, ఇతర నేర కార్యకలాపాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలతో కేసుల విచారణ నిర్వహించి నిందితులకు కోర్టుల్లో శిక్షలు పడేలా దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ పరిశుభ్రత, క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే పోలీసుల ప్రధాన బాధ్యతగా భావించి విధులు నిర్వర్తించాలని తెలిపారు. భవిష్యత్ పోలీసు వ్యవస్థకు దిశానిర్దేశం చేసే నాయకత్వ లక్షణాలను ప్రతి అధికారి అలవరచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ గెస్ట్ హౌస్ ప్రాంగణంలో డీఐజీ ఆర్. భాస్కరన్ జిల్లా ఎస్పీతో కలిసి మొక్క నాటారు .ఈ కార్యక్రమంలో డీఎస్పీలు ఎల్. జీవన్ రెడ్డి, ఎం. వెంకట నరసయ్య, కమతం ఇంద్రవర్ధన్, పోలీస్ కార్యాలయ ఏవో శివకుమార్, సూపరింటెండెంట్లు సులోచన, సంజీవ్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్, కమ్యూనికేషన్ విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### రహదారులపై ఏర్పడిన
## గుంతలను వెంటనే పూడ్చాలి

**సిర్పంగి స్వామి సిపిఎం మండల కార్యదర్శి**

**భువనగిరి జూలై 11 మహా న్యూస్** భువనగిరి నల్లగొండ రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలి అని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు శనివారం అక్కంపల్లి స్టేజి వద్ద ఏర్పడిన గుంతలను మరమ్మతులు చేపట్టాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు గుంతల మయమైన రోడ్డు మరమ్మతుల విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఉదాసీనంగా వ్యావరిస్తున్నారని వెంటనే తక్షణ చర్యలు చేపట్టాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కలుకూరు ముత్యాలు సత్తయ్య పాపయ్య ఇందిరా నగేష్ వేముల నాగరాజు నరేందర్ గణేష్ దుర్గయ్య నరసింహ తదితరులు పాల్గొన్నారు



## ఎస్ఐఆర్‌పై అవగాహన

- ప్రజాస్వామ్యానికి ఎంతో కీలకం
- ఓటు కాపాడుకోవాలి
- బీఎల్ఏలదే ముఖ్య పాత్ర
- కేబీ ఆసిఫాబాద్ జిల్లా పర్యటనలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**ఆసిఫాబాద్ మహా :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ ప్రజాస్వామ్యానికి కీలకమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వద్దేపల్లి గార్డెన్‌లో శనివారం ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పై నిర్వహించిన విస్తృత అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు కావాలని, అనర్హుల పేర్లు తొలగించి తప్పులు సరిదిద్దే ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించి ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని మండలాల బీఎల్ఏలు బాధ్యతాయుతంగా పనిచేసి అర్హత కలిగిన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ కోరారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, బీఎల్ఏ ఇన్‌చార్జి రాంగోపాల్ వర్మ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్యాంనాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్‌లు ఇరుకుల మంగ, కుడిమేత విశ్వనాథ్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటన
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు



**కేబీ ఆసిఫాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, గిరిజన సంక్షేమం, పేదల గృహ నిర్మాణం వంటి అన్ని రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ జిల్లాల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శనివారం జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను శాసనమండలి సభ్యులు దండే విఠల్, ఆసిఫాబాద్ శాసనసభ్యులు కోవ లక్ష్మి, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా ఎస్.పి. నితికా పంత్, అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల్ల మంగతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం మానిక్‌గూడ, వాంకిడి మండలం కోమటిగూడ గ్రామాలలో 20 లక్షల రూపాయల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించినట్టు తెలిపారు. ఈ భవనాల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన పరిపాలనా సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. గ్రామపంచాయతీలు గ్రామాల అభివృద్ధికి కేంద్రబిందువులుగా మారాలని, ప్రజలకు అవసరమైన సేవలు పారదర్శకంగా అందించాలని అధికారులను ఆదేశించారు. కెరమెరి మండలం ధనోరా గ్రామంలో 10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ప్రారంభించామని, మహిళా సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కావడానికి ప్రభుత్వం అనేక సంక్షేమ, స్వయం ఉపాధి కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలు సంఘటితంగా ముందుకు సాగి స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలతో పాటు సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలం అడ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి నిరుపేద కుటుంబానికి సొంత ఇంటి కలను నెరవేర్చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామానికి చెందిన పోడు రైతులు తాతముత్తాతల కాలం నుంచి తాము సాగు చేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, సాగు భూములలోకి వెళ్లకుండా పోలీసుల ద్వారా ఇబ్బందులు ఎదురవుతున్నాయని రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా స్పందిస్తూ 2005 సంవత్సరానికి ముందు నుంచి సాగు చేస్తున్న పాత పోడు భూముల విషయంలో రైతులను ఎట్టి పరిస్థితులలోనూ ఇబ్బందులకు గురిచేయవద్దని అధికారులకు సూచించారు. అదే సమయంలో కొత్తగా అటవీ భూములను ఆక్రమిస్తూ పోడు సాగు చేయకూడదని, పోడు భూములకు సంబంధించిన అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని చట్టాలకు సంబంధించినదని, గిరిజనేతర రైతుల సంబంధిత సమస్యలపై అధికారులతో చర్చించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సుర్దాపూర్ గ్రామ రైతుల భూ సమస్యపై జిల్లా అధికారులు, అటవీశాఖ అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించి, చట్టపరమైన సాధ్యాసాధ్యాలను పరిశీలించి సాగుకు అనుకూలమైన పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని తెలిపారు. భూములు, ఆస్తులు శాశ్వతం కావని, పిల్లలే మనకు నిజమైన ఆస్తి అని, వారిని బాగా చదివించి ఉన్నత స్థానాలలో నిలబెట్టడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత అని తెలిపారు. విద్య ద్వారానే కుటుంబాలు, గ్రామాలు, సమాజం అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

జిల్లా అభివృద్ధి, ప్రజల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల కల్పన, మహిళల సాధికారత, రైతుల సమస్యల పరిష్కారం వంటి అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు .ఈ కార్యక్రమాల్లో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




# హామీలు అమలులో రేవంత్ సర్కార్ విఫలం

- రైతులకు తీవ్ర అన్యాయం
- విమర్శలు తప్ప కనిపించని ప్రజా పాలన
- రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు ఖాయం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే రేగా

ఘాటు విమర్శలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రేగా కాంతారావు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సభలో సీఎం రేవంత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 117 గెలుచుకొని అధికారంలోకి వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పరిపాలనను ఇటు ప్రజలు అటు రైతులు చీదరించుకుంటున్నారని విమర్శించారు. దీంతో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 9 సీట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ పదికి పది సీట్లు గెలుచుకుంటుందని అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. రెండు లక్షల రుణమాఫీ ఎంత మందికి జరిగిందిదో బహిరంగ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. మూడు పంటలకు రైతు భరోసా ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి రైతులను మోసం చేసాడని విమర్శించారు. రెండు సంవత్సరాలు రైతు భరోసాను ఎగ్గొట్టిన ఘనత రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు.
రైతులకు కూలీలకు రైతు బీమా ఏమైందన్నారు. పోడు భూములకు పట్టాలు ఏమయ్యాయని ప్రశ్నించారు.
సీతారామ ప్రాజెక్టు నీళ్లను ముగ్గురు మంత్రులు పోటీపడి సాగర్ కెనాల్ కింద భూములకు తరలిస్తూ భద్రాద్రి జిల్లా రైతాంగం నోట్లో మన్ను కొడుతున్నారని విమర్శించారు. యూరియా యాప్ వల్ల ఒక రైతుకు ఉపయోగం లేదన్నారు. ఇందిరమ్మ పథకంలో కూడా అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అర్హులైన వారికి ఇండ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. మూతపడ్డ పసుపు బోర్డు, షుగర్ ఫ్యాక్టరీలను తిరిగి ఎప్పుడు ఓపెన్ చేస్తారోసమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలకు రైతులకు నమ్మకం పోయిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా రైతన్నకు కొండంత అండ

- జిల్లాలో రూ.318.42 కోట్ల నిధుల జమ
- 1.78 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా
- రైతు భరోసా నిధులను ఇతర బకాయిలకు సర్దుబాటు చేయొద్దు
- బ్యాంకులకు జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశం




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడంతో పాటు రైతులకు సాగు పెట్టుబడికి అవసరమైన ఆర్థిక తోడ్పాటును సకాలంలో అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో అర్హులైన రైతులందరి బ్యాంకు ఖాతాల్లో నిధుల జమ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. రైతులు ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాగు పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం విడతల వారీగా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కలెక్టర్ అంకిత్ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,78,828 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.318.42 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేయడం ద్వారా పంపిణీ ప్రక్రియను పూర్తిచేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు వ్యవసాయ రెవెన్యూ బ్యాంకింగ్ శాఖల సమన్వయంతో పారదర్శకంగా వేగవంతంగా నిధుల పంపిణీ నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ రైతు భరోసా రైతు బీమా నాణ్యమైన విత్తనాలు ఎరువుల సరఫరా సాగునీటి సౌకర్యాల కల్పన తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతులకు సాగు పెట్టుబడిపై ఆర్థిక భరోసా కల్పించి వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతు భరోసా పథకం కింద రైతుల ఖాతాల్లో జమయ్యే నిధులను బ్యాంకులు ఎట్టి పరిస్థితుల్లోనూ రుణ బకాయిలు సేవా ఛార్జీలు లేదా ఇతర బకాయిల పేరుతో నిలుపుదల చేయడం, డెబిట్ చేయడం లేదా సర్దుబాటు చేయరాదని జిల్లా కలెక్టర్ అంకిత్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సాగు పెట్టుబడి కోసం అందిస్తున్న ఈ ఆర్థిక సహాయం పూర్తి మొత్తంలో రైతుల వినియోగానికి అందుబాటులో ఉండేలా అన్ని బ్యాంకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు భరోసా నిధులపై ఎలాంటి అనధికారిక కోతలు విధించకుండా ప్రభుత్వం జమ చేసిన మొత్తాన్ని రైతులకు పూర్తిగా అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు.




# బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి సింగరేణి అడుగులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా**:సింగరేణిని బహుముఖంగా విస్తరించాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బొగ్గు గ్యాసిఫికేషన్ రంగంలోకి ప్రవేశించే అవకాశాలను సింగరేణి సమగ్రంగా పరిశీలిస్తోందని సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. శనివారం సింగరేణి భవన్‌లో పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పరిధిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ నాగులపల్లి శ్రీకాంత్‌తో జరిగిన సమావేశంలో కోల్ గ్యాసిఫికేషన్‌పై సింగరేణి చేపడుతున్న చర్యలను సీఎండీ వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాంగణంలో రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో అమ్మోనియం నైట్రేట్ మెల్ట్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్ అధ్యయనం నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు పెట్టుబడిపై రాబడి ఆశాజనకంగా లేదని మరింత మెరుగుపరిచేందుకు ప్లాంట్ సామర్థ్యాన్ని పెంచడం కేంద్ర ప్రభుత్వ వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ వినియోగం స్వదేశీ సాంకేతికత వంటి ప్రత్యామ్నాయాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇదే విషయంపై తాల్చేర్ ఎంసీఎల్-బీహెచ్ఈఎల్ జేఎస్పీఎల్ తదితర కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులను అధ్యయనం చేయడానికి ఈ నెలలో సింగరేణి అధికారుల బృందం పర్యటించనున్నట్లు తెలిపారు. అలాగే భీమారం చెన్నూరు సౌత్ నైనీ ప్రాంతాల్లో సర్ఫేస్ కోల్ గ్యాసిఫికేషన్ అవకాశాలపై సాంకేతికఆర్థిక విశ్లేషణ కొనసాగుతోందన్నారు. భూగర్భ బొగ్గు గ్యాసిఫికేషన్ విషయంలో కూడా బెల్లంపల్లి, రామగుండం ప్రాంతాల్లోని లోతైన బొగ్గు నిల్వల్లో ఐదు బ్లాక్‌లను గుర్తించినట్లు తెలిపారు. తొలి పైలట్ ప్రాజెక్టును బెల్లంపల్లి డిప్‌సైడ్ బ్లాక్లో చేపట్టేందుకు డ్రిల్లింగ్ ఏర్పాట్లు జరుగుతున్నాయని సీఎంఐఎఫ్ఆర్ శాస్త్రవేత్తల సాంకేతిక మార్గదర్శకత్వంలో ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ(ఆపరేషన్స్), కె.వెంకటేశ్వర్లు(ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్), గౌతమ్ పోట్రు(పర్సనల్ అండ్ ఫైనాన్స్), ఈడీ(కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జీఎం (కోఆర్డినేషన్ అండ్ మార్కెటింగ్) టి.శ్రీనివాస్, జీఎం(పీపీ)జి.దేవేందర్, జీఎం(బిజినెస్ డెవలప్‌మెంట్)రాందాస్, జీఎం(ఆర్ అండ్ డీ)వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# భూ రీ సర్వేను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టాలి

- సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే రాష్ట్ర వ్యాప్తంగా భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులను ఆదేశించారు.భూ రీసర్వే భూ భారతి అమలు సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం ఇందిరమ్మ ఇండ్లు 2బీహెచ్‌కే ఇళ్ల పంపిణీ పాఠశాల విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై మంత్రి శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణిని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని రైతుల భూములకు పూర్తి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ భారతి అమల్లోకి వచ్చి 15 నెలలు పూర్తయినా ప్రజల అంచనాలకు పూర్తిస్థాయిలో చేరలేకపోయామని తెలిపారు. ధరణి కాలంలో పెండింగ్‌లో ఉన్న 9.26 లక్షల సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం కోసం భూ భారతిలో అవకాశం కల్పించి హైకోర్టు సమస్యను కూడా పరిష్కరించినప్పటికీ అధిక సంఖ్యలో దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయనే అభిప్రాయం ప్రజల్లో ఉందని తిరస్కరణలకు గల కారణాలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతి చట్టం సమర్థవంతంగా అమలు కావాలంటే భూ రీసర్వే తప్పనిసరి అని మేధావులు సూచించడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇందు కోసం శిక్షణ పొందిన లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని రెగ్యులర్ సర్వేయర్లు లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. లైసెన్స్ సర్వేయర్లకు ఉద్యోగం లేదా రెగ్యులరైజేషన్ హామీ ఇవ్వలేదని స్పష్టం చేశారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాల్లోని ఐదు గ్రామాల్లో నిర్వహించిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి ములుగుమాడు గ్రామ రైతులకు కొత్త పట్టాదారు పాస్‌బుక్‌లు పంపిణీ చేశారని గుర్తు చేశారు. తొలి విడతలో ప్రతి జిల్లాలో 70 గ్రామాలను ఎంపిక చేసి రీసర్వే చేపట్టినట్లు తెలిపారు. రీసర్వేకు అవసరమైన అత్యుత్తమ నాణ్యత గల పరికరాలను జిల్లా స్థాయిలో కొనుగోలు చేయాలని కొనుగోలు ముందు రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్లు భూ రీసర్వేను అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకుని అవసరమైన సిబ్బంది పరికరాలు మౌలిక వసతులు సమకూర్చాలని ఆదేశించారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే ఇళ్లను ప్రస్తుత స్థితిలోనే లబ్ధిదారులకు అందజేసి మిగిలిన పనులకు నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. జిల్లాలో భూ సర్వే పురోగతిని జిల్లా కలెక్టర్ అంకిత్ మంత్రికి వివరించారు. అక్కినేపల్లి గ్రామంలో మొత్తం 8,990 ఎకరాలకు గాను సుమారు 4,900 ఎకరాల సర్వే పూర్తయిందని తెలిపారు. గుండాల మండలంలో సర్వే పనులు కొనసాగుతున్నాయని పెద్దవేంకటాపురం గ్రామంలో 537 ఎకరాలు శుభంపేట గ్రామంలో 267 ఎకరాల సర్వే పూర్తయిందన్నారు. మాదారం గ్రామంలో సోమవారం నుంచి రీసర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం పరిధిలో ఈ నెలలోనే 5,000 ఎకరాలకు భూ సర్వే చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలో మొత్తం 17 గ్రామాల్లో రీసర్వే నిర్వహణకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామని తొలి దశలో 14 గ్రామాలను ఎంపిక చేసి పాల్వంచ గుండాల పినపాక దుమ్ముగూడెం బూర్గంపాడు మండలాల్లో సుమారు 4,000 ఎకరాల సర్వే పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు చేపట్టామని వివరించారు. జిల్లాలో మొత్తం 206 మంది లైసెన్స్ సర్వేయర్లు ఉన్నారని వారిలో 56 మంది జిల్లాకు కేటాయించబడ్డారని కలెక్టర్ తెలిపారు. కేటాయించబడిన వారిలో ఇప్పటికే 16 మంది విధుల్లో చేరి భూ రీసర్వే పనులు నిర్వహిస్తున్నారని మిగిలిన వారు కూడా త్వరలో విధుల్లో చేరనున్నట్లు వివరించారు. విధుల్లో చేరిన సర్వేయర్లకు రిటైర్డ్ సర్వేయర్ల ద్వారా అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కొత్తగూడెం ఆర్డీవో మధు, ఏడి ల్యాండ్ సర్వే అధికారి శ్రీనివాసరావు, తాసిల్దార్ లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చిరంజీవి అభిమాని కుటుంబానికి ఆర్థిక సాయం

**కరీంనగర్ మహా :** ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో శనివారం హృదయాన్ని కదిలించే సేవా కార్యక్రమం నిర్వహించారు. కమలాపూర్ మండలానికి చెందిన దివంగత చిరంజీవి అభిమాని కిరణ్ కుమార్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ప్రతి సంవత్సరం అందిస్తున్న రూ.20 వేల విద్యా సహాయాన్ని ఈ ఏడాది కూడా ఆయన భార్య స్వప్నకు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంతరావు చేతుల మీదుగా అందజేశారు. దివంగత కిరణ్ కుమార్‌కు ఇద్దరు కుమార్తెలు ఉండగా, వారి విద్యాభ్యాసానికి చేయూతగా ప్రతి ఏడాది ఈ ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు బసవరాజ్ శ్రీనివాస్ తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా నిలవడం సమాజం బాధ్యత అని ఈ సందర్భంగా వి. హనుమంతరావు పేర్కొన్నారు. బసవరాజు శ్రీనివాస్ చేపడుతున్న ఈ సేవా కార్యక్రమం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్, నాయకులు జనగామ నాగరాజు, అరుణ్ తేజ చారి, మిడిదొడ్డి కపిల్ మాధవ్, గాలిపెల్లి కుమార్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.




# సమస్యలకు నిలయంగా ఆశ్రమ పాఠశాల

- జిల్లా అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి
- మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్

**జూలూరుపాడు, మహా:**మండల పరిధి పడమట నర్సాపురం గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాల సమస్యలకు నిలయంగా మారిందని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా అధికారులు వెంటనే స్పందించి ఆశ్రమ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శనివారం సిపిఎం బృందం పడమట నర్సాపురం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల్ని అడిగి వారు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో వైఫల్యం చెందిందన్నారు. గిరిజన విద్యార్థుల పట్ల, విద్యాలయాల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని విమర్శించారు. పాఠశాలలు ప్రారంభం అయి నెల రోజులు గడిచినా నోట్ బుక్స్, కాస్మోటిక్స్, దుప్పట్లు ఇంతవరకు విద్యార్థులకు పంపిణీ చేయలేదన్నారు. నీటి వసతి లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. 4, 6, 7 తరగతుల విద్యార్థులకు వెంటనే తెలుగు, ఇంగ్లీష్ టెక్స్ట్ బుక్స్ తో పాటు, విద్యార్థులకు యూనిఫాం వెంటనే అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రేపాకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి యాసా నరేష్, మండల కమిటీ సభ్యులు వలమల చంద్రావు, రెడ్డి, భోజన గోవిందు, తాటి పద్మ, గార్లపాటి వెంకటి, బోడా భిమిత్ర, జల్లిక రాధాకృష్ణ, శాఖ కార్యదర్శిలు ఇల్లంగి సీతారాములు, తోలం సరస్వతి, మల్లయ్య, దానయ్య, సామ్య తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు సమయంలో స్వీయ రక్షణ పై ప్రజలకు అవగాహన

**10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ బృందం అధికారులతో జిల్లా కలెక్టర్ డా. సత్య శారద సమీక్ష**








**మహా వరంగల్ బ్యూరో :** వరంగల్ జిల్లాలో 10వ బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్, విజయవాడ బృందం ఆధ్వర్యంలో జూలై 11 నుంచి 20 వరకు నిర్వహించనున్న సామాజిక అవగాహన, విపత్తు సంసిద్ధత కార్యక్రమాల నిర్వహణ పై వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శనివారం కలెక్టరేట్ లో జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విపత్తు నిర్వహణ ప్రణాళిక, వరదలు, అగ్నిప్రమాదాలు, ఇతర ప్రకృతి విపత్తులకు గురయ్యే ప్రాంతాల గుర్తింపు, ముందస్తు సంసిద్ధత చర్యలు, ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణ తదితర అంశాల పై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఎన్‌డీఆర్ఎఫ్ బృందానికి అవసరమైన సమాచారం, పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. విపత్తులు ఎప్పుడు, ఎక్కడ సంభవిస్తాయో తెలియదని, అలాంటి పరిస్థితుల్లో ఎన్‌డీఆర్ఎఫ్ అందిస్తున్న శిక్షణ ప్రజలు తమ ప్రాణాలను కాపాడడంలో ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, ప్రజాప్రతినిధి ఇటువంటి నైపుణ్యాలను నేర్చుకోవాలని, జిల్లాలోని అన్ని మండలాలు, విద్యాసంస్థల్లో విపత్తు నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ నేతృత్వంలోని బృంద సభ్యులు కె.వెంకటేశ్వర్లు, ఐ. హరికృష్ణ, ఎస్. సతీష్ కుమార్ ఆచరణాత్మక ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విపత్తుల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానం పై సహాయక చర్యలను ప్రత్యక్షంగా ఆచరణాత్మక ప్రదర్శనలు నిర్వహించారు. తుఫానులు, వరదలు, భూకంపాలు వంటి విపత్తులు సంభవించినప్పుడు భయాందోళన చెందకుండా సమయస్ఫూర్తితో వ్యవహరించి బాధితులను సురక్షిత ప్రాంతాలకు చేర్చడం, గాయపడిన వారికి ప్రాథమిక చికిత్స అందించడం, అగ్నిప్రమాదాల సమయంలో మంటలను అదుపు చేసే పద్ధతులు, అగ్నిమాపక పరికరాల వినియోగంపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. సంధ్యారాణి, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సుమ,ఉమారాణి, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అయ్యో...నేను బ్రతికే ఉన్నాను..

- దొంగ రిజిస్ట్రేషన్ తో నా భూమి లాక్కున్నారు..
- భూమి కోసం నన్ను చంపకండయ్యా....
- "సర్" కార్యక్రమం తో బయటపడ్డ అవినీతి బాగోతం.
- రెవిన్యూ అవినీతి కి నిలువెత్తు సాక్ష్యం..
- దమ్మపేట మండలంలో వృద్ధుడి గాథ.





**దమ్మపేట,మహా :** "అయ్యో...నేను బ్రతికే ఉన్నాను.. భూమికోసం నన్ను చంపేశారు.బ్రతికి ఉండగానే రికార్డుల లో చంపేసి నా భూమిని కబ్జా చేశారు ." అంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలానికి చెందిన మళ్ళా సత్యం అనే రైతు ధీన గాద ఇది.
2018 లోనే రికార్డుల పరంగా భూ యజమానిని చంపేశారు. అడిగే వారు లేరులే అనుకొని ఏజెన్సీ ప్రాంతంలోని 5ఎకరాల భూమిని రెవిన్యూ అవినీతి తిమింగిళాలతో కలిసి స్వాహా చేశారు.
తీరా సర్ కార్యక్రమం పుణ్యమా..అంటూ ఈ విషయం వెలుగు చూసింది."అంతా ఆన్‌లైన్ చేశాం.. ఎవరు ఇతరుల భూములను మార్చలేరు.. పారదర్శకంగా మ్యుటేషన్ జరుగుతాయి.." రెవెన్యూ ఆన్‌లైన్ పోర్టల్ (భూభారతి/ధరణి) గురించి ప్రభుత్వాలు గొప్పగా చెబుతున్న మాటలివి. కానీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్నది చూస్తుంటే ఇదంతా ఒక పెద్ద అబద్ధం అని తేలిపోతోంది. రహస్య కవచంగా నిలవాల్సిన రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమో, లేక అవినీతి కుమ్మక్కో గానీ.. బతికున్న రైతుల భూములు దర్జాగా పరుల పాలవుతున్నాయి.
ఏజెన్సీ ప్రాంతాల్లోని భూములను కాపాడేందుకు తెచ్చిన కఠిన చట్టాలను సైతం భూ మాఫియా తమకు అనుకూలంగా మలుచుకుంటోంది. దమ్మపేట మండలంలో వెలుగుచూసిన ఒక నిరుపేద భూమి మ్యూటేషన్ వ్యవహారం.. స్థానిక రెవెన్యూ వ్యవస్థలోని డొల్లతనాన్ని, కల్లబొల్లి తనాన్ని కమ్మేసి అవినీతిని బట్టబయలు చేసింది. ఈ ఒక్క ఘటనే కాకుండా, మండలంలో ఇంకెన్ని పచ్చని పొలాలు ఇలా దొడ్డిదారిన కాగితాల్లో చేతులు మారాయో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**భూ మాఫియాకు ఆయుధం..వారసత్వమా...?**

దమ్మపేట మండలంలోని పెద్దగొల్లగూడెం తదితర గ్రామాలు పూర్తిగా 1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీ ప్రాంతాలు. ఈ చట్టం ప్రకారం గిరిజనేతర రైతుల మధ్య భూముల క్రయవిక్రయాలు పూర్తిగా నిషిద్ధం. దీనికి తోడు ప్రసుత్తం భూభారతి పోర్టల్‌లో ఏజెన్సీ భూములకు 'పార్టిషన్' (విభజన) విధానం కూడా అందుబాటులో లేదు.దీంతో ఏజెన్సీ భూములను కాజేయాలనుకునే కేటుగాళ్లు పక్కా స్కెచ్ వేశారు. రిజిస్ట్రేషన్‌ను, పార్టిషన్‌ను సాధ్యం కాదు కాబట్టి, 'వారసత్వం' (సక్సెషన్) కింద కుటుంబ సభ్యులకు యాజమాన్య హక్కులు బదిలీ చేసుకునే వెసులుబాటును ఆయుధంగా మలచుకున్నారు.'వారసత్వం' కింద భూమి దక్కాలంటే పట్టాదారుడు చనిపోవాలి. అందుకే అమాయకపు రైతులను, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని వారు బ్రతికుండగానే కాగితాల్లో చంపేసి కథ మొదలు పెడుతున్నారు.

**మళ్లా సత్యం ఉదంతమే సజీవ సాక్ష్యం..**

పెద్దగొల్లగూడెం ఏజెన్సీకి చెందిన వృద్ధ రైతు మళ్లా సత్యం విషయంలో అచ్చం ఇదే జరిగింది. ఆయనకు 5 ఎకరాల సాగు భూమి ఉంది. సత్యానికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కానీ ఆయన భూమిపై కన్నేసిన అక్రమార్కులు.. సత్యం 2018లోనే చనిపోయినట్లు నకిలీ మరణ ధృవీకరణ పత్రం సృష్టించారు. ఆ కుటుంబానికి ఏమాత్రం సంబంధం లేని మరో మహిళను ఆయన ఏకైక వారసురాలిగా ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ లో పొందుపరిచి, దర్జాగా ఆన్‌లైన్‌లో 5 ఎకరాల భూమిని మ్యుటేషన్ చేశారు. ఒటీఆర్ జాబితా సర్వేలో సత్యం పేరు గల్లంతు కావడంతో ఈ వ్యవహారం యాదృచ్ఛికంగా వెలుగులోకి వచ్చింది.

**అధికారుల అవినీతిని నిరూపిస్తున్న వైనం :**

బతికున్న మనిషికి వారసత్వ పత్రాలు జారీ చేసి, భూమిని ఎలా మ్యుటేషన్ చేసేశారని దమ్మపేట తహసీల్దార్‌ను ' మహా ' ప్రశ్నిస్తే.. విస్తుపోయే నిజాలు వెల్లడించారు.

**తహశీల్దార్ సమాదొనమిస్తూ....**

"గ్రామ పరిపాలనాధికారి (జీపీవో) నా సంతకాన్ని, ఆర్ ఐ సంతకాన్ని ఫోర్జరీ చేసింది.. ఆ ఫైళ్లను చూసుకోకుండా డిజిటల్ సైన్ చేశాను" అని బుకాయిస్తున్నారు.ఎంత మాత్రం నమ్మశక్యంగా లేని సమాదానంతో సాంకేతిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ మాన్యువల్ ప్రకారం ఒక మ్యుటేషన్ ఎలా జరగాలో చూసే అధికారుల అసమర్థత, లేదా వారి ప్రమేయం ఇట్టే అర్థమవుతుంది.

**నోటీసు నిబంధనలు ఏమాయెనో.....**

ఆన్‌లైన్‌లో సక్సెషన్ దరఖాస్తు రాగానే జీవో, ఆర్డర్ విచారణ చేసిన అనంతరం.. సంబంధిత పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయం, గ్రామ పంచాయతీలకు నోటీసులు వెళ్తాయి. 15 రోజులు పాటు ఆ నోటీసులను ప్రదర్శించి అభ్యంతరాలు స్వీకరించాలి. మరి మళ్లా సత్యం భూమి విషయంలో ఈ నోటీసులు ఎందుకు వెళ్లలేదు? వెళ్లి అతను బతికున్నాడన్న సంగతి అన్ని శాఖల అధికారులకు ఎందుకు తెలియలేదు? కాగితాల మీద సంతకాలు జీపీవో ఫోర్జరీ చేసి ఉండొచ్చు. కానీ ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫైల్‌ను అప్‌లోడ్ చేసి మ్యూటేషన్ చేయాలంటే తహసీల్దార్ వ్యక్తిగత లాగిన్, బయోమెట్రిక్ లేదా ప్రత్యేకమైన డిజిటల్ కీ తప్పనిసరి. ఈ డిజిటల్ కీ లేకుండా ఆన్‌లైన్ వ్యవస్థలో ఫోర్జరీ చేయడం సాధ్యం కాదు. మరి తహసీల్దార్ డిజిటల్ కీకి హ్యాకర్ చేతుల్లోకి ఎలా వెళ్లింది..?
దమ్మపేట రెవెన్యూ యంత్రాంగంపై వస్తున్న ఈ తరహా ఆరోపణలు కేవలం ముంచుకొండలో ఒక అంచు మాత్రమేనని పలువురు భావిస్తున్నారు. ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో రెవెన్యూ రికార్డుల ప్రకాళన అత్యవసరం. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి ఒక ప్రత్యేక బృందంతో విచారణకు ఆదేశించాలని గత కొన్నేళ్ళుగా దమ్మపేట మండలంలో 'వారసత్వం' కింద జరిగిన మ్యూటేషన్ రికార్డుల 'చిట్టా' మొత్తం బయటకు తీయాలి. ఏపీ ల్యాండ్ పరిష్కరించి ఏ సిస్టమ్ నుంచి డిజిటల్ సైన్స్‌ను పద్దాయో నిర్ధారించాలి. ఆపై ఫైల్‌లో పెట్టిన డేట్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు అసలునకిలీలను క్రైమ్‌సాయిలో విచారించి క్రాస్ చెక్ చేయాలి. అప్పుడే ఈ నకిలీ వారసత్వాల వెనుక ఉన్న అసలు మాఫియా డొంక కదులుతుంది. లేదంటే కాగితాల్లోనే సామాన్యులు చనిపోతూనే ఉంటారు, వేల ఎకరాల ఏజెన్సీ భూములు పరుల పాలవుతూనే ఉంటాయి.ఆన్లైన్ కాకముందు జరిగిన తప్పిదాలు ,అధికారుల అవినీతి బయటపడాలంటే ఆన్ లైన్ చేయకముందు జరిగిన అక్రమాలను కూడా పరిగణన లోకి తీసుకోవాలని బాదితులు కోరుతున్నారు.



# పేదల ఆరోగ్యానికి భరోసా సీఎంఆర్ఎఫ్ పథకం

- చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్సీ, డిసిసి అధ్యక్షులు

**మహా వరంగల్ బ్యూరో;** మాజీ మంత్రి ప్రస్తుత ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య నివాసంలో సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. 45 మంది లబ్ధిదారులకు 25 లక్షల మొత్తాన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ డిసిసి అధ్యక్షులు మొహమ్మద్ అయూబ్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం కింద చెక్కుల రూపంలో పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ పేద మధ్య తరగతి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు లోనై ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ నుండి అందించే ఆర్థిక సహాయం గొప్ప వరమని, ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా బాగుంటేనే ఆ కుటుంబం బాగుంటుందని అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలో చేపట్టిన వెంటనే ఆరోగ్యశ్రీ పథకం కింద పేద ప్రజలకు పది లక్షల రూపాయల వరకు ఉచితంగా వైద్యం అందించే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ మెంబర్ నల్లగొండ రమేష్, మాజీ కార్పొరేటర్లు గుండేటి నరేంద్ర కుమార్, బస్వరాజు శిరీష, శ్రీమాన్, తత్తరీ లక్ష్మణ్, జన్ను ఆరోహన్, ధూపం సంపత్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరివి పరమేష్, యూత్ కాంగ్రెస్ తూర్పు నియోజకవర్గం అధ్యక్షుడు సలీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోరంట్ల రాజు, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సోమ లక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మురళి గౌడ్, కూర తోట సదానందం, కాశెట్టి వేణు, బోలుగొడ్డు శ్రీనివాస్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎస్ఐఆర్ ప్రక్రియ పై అవగాహన తప్పనిసరి

- తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి
- ఎవరి పేరు మిస్ అయినా ఇప్పుడే సరిదిద్దుకోండి

**మహా వరంగల్ బ్యూరో;** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై 22వ డివిజన్ ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాజా మాజీ కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు.శనివారం డివిజన్ లోని వివిధ కాలనీల్లో పర్యటించిన కుమారస్వామి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించాలని సూచించారు. నూతనంగా 18 ఏళ్లు నిండిన యువత, పేరు మార్పు, చిరునామా మార్పు ఉన్నవారు తప్పనిసరిగా ఫారం 6, 7, 8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ అంటే ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా సరిచూసే ప్రక్రియ అని ఎవరి పేరు మిస్సయిన ఇప్పుడే చూసుకోవాలని ఈసారి చాలా మంది పేర్లు తొలగిపోయే అవకాశం ఉందని అందుకే ప్రతి ఒక్కరూ తమ పేరు, వయసు, చిరునామా వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయో చెక్ చేసుకోవాలని ఎవరికైనా అనుమానాలు ఉంటే మా ఆఫీస్‌లో గానీ, బూత్ లెవల్ ఆఫీసర్ దగ్గర గానీ సంప్రదించవచ్చు అని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా వృధా కాకూడదని అన్నారు.

**కమ్యూనిటీ హాల్ లో సేవలు**

డివిజన్ లోని కమ్యూనిటీ హాల్ లో ప్రత్యేక సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. బీఎల్ఓలు, ఆశా వర్కర్లు కలిసి ప్రజలకు ఫారాలు నింపడంలో సహాయం చేస్తున్నారని అర్హులైన కొత్త యువ ఓటర్ల దరఖాస్తులు అక్కడికక్కడే స్వీకరించడం జరుగుతుందని ఎస్ఐఆర్ ప్రక్రియ ఈ నెల 30 వరకు కొనసాగుతుందని, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా కూడా వివరాలు చెక్ చేసుకోవచ్చని కార్పొరేటర్ తెలిపారు.

**ఎస్ఐఆర్‌లో ఏం చేయాలి?**

voters.eci.gov.inవెబ్ సైట్ లో పేరు చెక్ చేయాలి కొత్త ఓటు ఫారం 6 పేరు తొలగింపు ఫారం 7 వివరాల మార్పు ఫారం 8 చివరి తేదీ: ఈ నెల 30 అని మాజీ కార్పొరేటర్ తెలిపారు. తాజా మాజీ కార్పొరేటర్ కుమారస్వామి వెంట బీఎల్ఓలు, స్థానిక నాయకులు జన్ను ప్రమోద్, చిన్న సుధాకర్, రైల్వే సుధాకర్, ప్రశాంత్ సయ్యద్ సాబీర్, తో పాటు స్థానికులు ఉన్నారు.

# మేడ్చల్, జవహర్ నగర్, కీసర మండలాల్లో భారీ పోలీసు బందోబస్తు

- జేపీసీ ఆందోళనకు అడ్డుకట్ట
- షమీర్ పేట పీఎస్ కు వెళ్ళిన ఎంపీ ఈటల

కుషాయిగూడ, మహా : జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ నుఎత్తివేయాలంటూ జేపీసీ ఇచ్చిన ఆందోళన పిలుపు నేపథ్యంలో మేడ్చల్, జవహర్ నగర్ కీసర మండలాల్లో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిరసన కార్యక్రమాలకు వివిధ రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యే అవకాశం ఉండటంతో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచే కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని కీసర పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆయా ప్రాంతాల్లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ షామీర్ పేట పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఆందోళనకారులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ జవహర్ నగర్ నుండి డంపింగ్ యార్డ్ ను ఎత్తివేసేంత వరకు ఆందోళన కార్యక్రమాలను విరమించబోమని రానున్న కాలంలో మరింత ప్రజా ఉద్యమాలను బలోపేతం చేస్తామన్నారు రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ ను ఎత్తివేస్తామని హామీ ఇచ్చారని నేరు విస్మరించారని రాజేందర్ మండిపడ్డారు

ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. మరోవైపు, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను పూర్తిగా ఎత్తివేసే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని జేపీసీ నాయకులు స్పష్టం చేశారు



# ఎస్ఐఆర్ ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు

- జూలై 14లోపు 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హనుమకొండ మహా;** ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని, ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం సహించేది లేదని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి స్పష్టం చేశారు. శనివారం హనుమకొండ పట్టణంలోని గాంధీనగర్, అశోక్ కాలనీ, గోకుల్ నగర్, లష్కర్ సింగారం, లష్కర్ బజార్ తదితర ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి ఎస్ఐఆర్ నమోదు ఫారాల స్వీకరణ, డిజిటలైజేషన్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) మాట్లాడిన కలెక్టర్, ఫారముల స్వీకరణ, వాటి డిజిటలైజేషన్ పురోగతి, పెండింగ్ వివరాలను స్వయంగా పరిశీలించారు. లష్కర్ బజార్ పరిధిలో డిజిటలైజేషన్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సంబంధిత బీఎల్ఓను మందలించారు. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువులను తప్పనిసరిగా పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 14వ తేదీలోపు ఎస్ఐఆర్ నమోదు ఫారాల డిజిటలైజేషన్‌ను వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి రోజు అందిన దరఖాస్తులను అదే రోజు డిజిటలైజ్ చేసి పెండింగ్ లేకుండా చూడాలని, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా ఉండాలని సూచించారు. డిజిటలైజేషన్ శాతం తక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలను జిల్లా స్థాయి అధికారులు స్వయంగా సందర్శించి ప్రతిరోజూ సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడ సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించి లక్ష్య సాధనకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, ఐకేపీ ఏపీఎంలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఓఏలు, రిసోర్స్ పర్సన్ల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత సిబ్బంది బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించి ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హుడైన ఓటర్ ను గుర్తించాలిఅర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు తమ ఓటు హక్కును కోల్పోకూడదని, ప్రతి అర్హుడైన ఓటర్ ను గుర్తించి, వారి దరఖాస్తులను సకాలంలో స్వీకరించి డిజిటలైజేషన్ పూర్తి చేయడం మనందరి బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. నేడు, రేపు (ఆదివారం) ప్రత్యేక కార్యాచరణతో అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ పరిశీలనలో హనుమకొండ ఆర్డీఓ వెంకటేష్, తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఎన్నికల సూపర్వైజర్లు, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

# భూముల రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**మంచిర్యాల, మహా :** రాష్ట్రంలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్ నుంచి రాష్ట్ర మంత్రి, హైదారాబాద్ నుండి రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, గృహ నిర్మాణ శాఖ ఎం.డి. వి.పి. గౌతమ్, సెర్ప్ సి.ఈ.ఓ. దివ్య దేవరాజన్ లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా భూముల సర్వే, రీసర్వే కార్యక్రమం అమలు, పురోగతి, చేపట్టాల్సిన కార్యాచరణ, భూ భారతి, సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు, రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ, విద్యార్థుల యూనిఫాంల పంపిణీ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెవెన్యూ మ్యాపులు అందుబాటులో లేని గ్రామాలకు శాశ్వత భూ రికార్డుల రూపకల్పన లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ప్రతి జిల్లాలో ఎంపిక చేసిన 70 గ్రామాలలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం, జి.పి.ఎస్. ఆధారిత సర్వే పరికరాలు, డిజిటల్ మ్యాపింగ్ విధానాలను వినియోగిస్తూ రీసర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో ప్రతి దశలో పారదర్శకత, ఖచ్చితత్వం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పురోగతిని సమీక్షించాలని, అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుని ప్రక్రియను వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామస్థులకు సర్వేపై పూర్తి అవగాహన కల్పించి, వారి అభ్యంతరాలు, సందేహాలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమగ్ర సర్వే పూర్తయిన అనంతరం రాష్ట్రంలో భూ రికార్డులు మరింత ఖచ్చితత్వంతో సిద్ధమవడంతో భూ వివాదాల పరిష్కారం సులభతరం అవుతుందని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారానికి కారణాలను గుర్తించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. భూ భారతిలో భూ రీసర్వే కొరకు శిక్షణ పొందిన 5 వేల 700 మంది లైసెన్స్ సర్వేయర్ల సేవలను వినియోగించుకోవాలని, రెగ్యులర్ సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా నక్షాలు లేని 413 ప్రాంతాలలో చేపట్టిన రీసర్వేతో 95 శాతం వరకు భూ సమస్యలు పరిష్కరించడం జరిగిందని తెలిపారు. సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల మేరకు పరిష్కరించి, అర్హులైన వారికి నోటీసులు త్వరితగతిన జారీ చేయాలని తెలిపారు. అనంతరం మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ భూముల రీ సర్వే, భూభారతి, సాదాబైనమా దరఖాస్తుల పరిష్కారం, ఇందిరమ్మ ఇండ్లు ఇతర ప్రభుత్వ పథకాల అమలులో నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 13న బిజెపి ఆధ్వర్యంలో "సింగరేణి భరోసా" యాత్ర

- హాజరుకానున్న బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ అధ్యక్షుడు రామచంద్రరావు
- విలేకరుల సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి అభివృద్ధితోపాటు కార్మిక వర్గం సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసే ప్రక్రియలో భాగంగా ఈనెల 13వ తేదీన భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సింగరేణి భరోసా యాత్రకు పార్టీ శ్రేణులు, సింగరేణి కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన సింగరేణి భరోసా యాత్రలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, బిజెపికి చెందిన ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణిని రక్షించే క్రమంలోనే సంస్థకు "తాడిచెర్ల" బొగ్గు గనులను కేటాయించిన నేపథ్యంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు పర్యటించునున్నట్లు తెలిపారు. తెలంగాణలో ఉన్న ఎనిమిది మంది శాసనసభ్యులు కూడా కొత్తగూడెం పర్యటనకు రానున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తోందని అన్నారు. సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 40 వేల మంది కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. అంతేకాకుండా సంస్థ అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తోందని పేర్కొన్నారు. గతంలో బిజెపి ప్రధానమంత్రిగా ఉన్న అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలోని ఆనాటి కేంద్ర ప్రభుత్వం కూడా సింగరేణి సంస్థకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందించిందని గుర్తు చేశారు. అదే విధంగా ప్రస్తుతం కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి గంగాపురం కిషన్ రెడ్డి నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం సింగరేణి అభివృద్ధి కార్మికుల సంక్షేమం కోసం సంపూర్ణ సహకారం అందిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 13వ తేదీన జరుగనున్న కొత్తగూడెం పర్యటనను విజయవంతం చేయాలని భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ముఖ్యంగా సింగరేణి కార్మికులు వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జాటోత్ వెంకన్న నాయక్, రాష్ట్ర గిరిజన మోర్చా కార్యదర్శి భూక్య రవి నాయక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎస్.కె రెహమతుల్లా, జిల్లా మీడియా కన్వీనర్ రామారావు, ఆత్మ నిర్భర్ భారత్ జిల్లా కన్వీనర్ గొడుగు శ్రీధర్ యాదవ్, లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి మండల అధ్యక్షులు నవీన్, బలగం శ్రీధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలి

**రాజేంద్రనగర్, మహా:** జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ అధ్యక్షుడు అలమనేటి గోపాల్ కోరారు. శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, 13న జరిగే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ సభ్యులందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించడంతో పాటు అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# లయన్స్ క్లబ్‌లకు 50 డయాబెటిస్ కిట్లు

- షుగర్ వ్యాధిని ప్రారంభ దశలో నిర్మూలించవచ్చు
- లయన్స్ ట్రస్ట్ చైర్మన్ కొత్త రామారావు



**కుషాయిగూడ, మహా :** మధుమేహాన్ని ప్రారంభ దశలోనే గుర్తించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320 హెచ్ ఆధ్వర్యంలో శనివారం కుషాయిగూడ లయన్స్ భవన్‌లో 50 డయాబెటిస్ డిటెక్షన్ కిట్లను జిల్లా వ్యాప్తంగా ఉన్న లయన్స్ క్లబ్‌లకు పంపిణీ చేశారు. ప్రతి క్లబ్ తమ పరిధిలో మధుమేహ నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా సూచించారు. కార్యక్రమానికి జిల్లా గవర్నర్ లయన్ అశోక్ కుమార్ స్వైన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రథమ వైస్ జిల్లా గవర్నర్ డి. లింగా రెడ్డి, జిల్లా ముఖ్య సలహాదారు మనోహర్ రెడ్డి, కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ చైర్మన్ కొత్త రామారావు, డాక్టర్ ఎన్. దేవి సుష్మ పాల్గొన్నారు. జిల్లా కార్యదర్శి-గ్లోబల్ కాజెస్ కన్వీనర్ కొత్తపల్లి రాంబాబు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మధుమేహంపై అవగాహన పెంచడంతో పాటు ముందస్తు నిర్ధారణకు ఈ కిట్లు ఉపయోగపడతాయని తెలిపారు. జిల్లా గవర్నర్ అశోక్ కుమార్ స్వైన్ మాట్లాడుతూ కుషాయిగూడ లయన్స్ ట్రస్ట్ హాస్పిటల్ గత 25 ఏళ్లుగా నిరుపేదలకు అందిస్తున్న వైద్య సేవలను ప్రశంసించారు. ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేసిన లయన్ రియాజ్ అహ్మద్ ఖాన్, చంద్రశేఖర్, పిల్లి, రవిశంకర్ రాజులను అభినందించారు. కొత్త రామారావు మాట్లాడుతూ ట్రస్ట్ హాస్పిటల్ ద్వారా మరిన్ని వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. మనోహర్ రెడ్డి మాట్లాడుతూ నూతన సభ్యులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని లయనిజం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రీజినల్, జోన్ చైర్మన్లు, వివిధ క్లబ్‌ల పదాధికారులు, లయన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పేకాట ఆడుతున్న వారిపై కోటపల్లి పోలీసుల ఆకస్మిక దాడి

**మంచిర్యాల, మహా :** కోటపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, నగదు, మొబైల్ ఫోన్లు, ద్విచక్ర వాహనం, పేకాట సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు కోటపల్లి ఎస్.ఐ. ఎస్ రాజశేఖర్ తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు ఆల్గాం గ్రామ శివారు ఎస్ ఆర్ ఆర్ ఫర్టిలైజర్ షాప్ వద్ద కొంతమంది వ్యక్తులు మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చినట్లు చెప్పారు. శనివారం తమ సిబ్బందితో ఘటన స్థలానికి వెళ్లే గా ఇద్దరు వ్యక్తులు పరారు కాగా దుర్గం రామ్‌దేవ్, గట్టు తిరుపతి గౌడ్, గారె రాజలింగు, అల్లూరి అభిషేక్ అనే నలుగురిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. పరారైన వ్యక్తులు గట్టు శ్రీనివాస్, రామ్‌టెంకి సునీల్ గుర్తించినట్లు వెల్లడించారు. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, పోలీస్ కానిస్టేబుళ్లు శ్రావణ్, నరేష్ టీజీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు



## రోడ్ల పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలో రూ.2.30 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్ల బలోపేతం, దెబ్బతిన్న రహదారుల రీకార్పెటింగ్ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శనివారం పరిశీలించారు. స్థానిక కాలనీవాసులతో కలిసి మారుతి ఎన్‌క్లేవ్‌లో రోడ్డు నంబర్ 1 నుంచి 13 వరకు, జీహెచ్ఎంసీ ఫ్రీడమ్ పార్క్ నుంచి పోచమ్మ ఆలయం వరకు, వైష్ణవి ఎన్‌క్లేవ్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రోడ్ల పరిస్థితిని పరిశీలించిన ఎమ్మెల్యే స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి కాలనీలో రహదారులతో పాటు అవసరమైన అభివృద్ధి పనులను దశలవారీగా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, నేమూరి మహేష్ గౌడ్ సప్పిడి శ్రీనివాస్ రెడ్డి దప్పు గిరిబాబు బుచ్చన్న గారి శ్రీకాంత్ రెడ్డి కడియాల బాబు కోల నరేష్ శ్రీకాంత్ రెడ్డి వెంకట్ రెడ్డి జై జైపాల్ రెడ్డి రాజేశ్వర్ గుప్తా వీరభద్రారావు నవీన్ యాదవ్ స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## ప్రజలకు వైద్య సేవలపై అప్రమత్తంగా ఉండండి

**నూతన డీఎంహెచ్ఓ డా. ఆనంద్‌కు ఎమ్మెల్యే సూచన**

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డీఎంహెచ్ఓ గా బాధ్యతలు చేపట్టిన డా. ఆనంద్ శనివారం సైనిక్‌పురిలోని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యలు, ప్రభుత్వ ఆరోగ్య సేవల విస్తరణ, ఉప్పల్ నియోజకవర్గంలో వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రజారోగ్యానికి సంబంధించిన పలు అంశాలపై ఇరువురు చర్చించారు. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో తన పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన డా. ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన విజయవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు.


# చీరకట్టులో నభా అందాల సందడి

తెలుగు, కన్నడ చిత్రసీమల్లో తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక నభా నటేష్ మరోసారి తన సాంప్రదాయ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. రంగురంగుల చీరలో సంప్రదాయ ఆభరణాలు ధరించి ఆమె చేసిన తాజా ఫొటోషూట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నభా అందానికి అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.1995 డిసెంబర్ 11న కర్ణాటకలోని శృంగేరిలో జన్మించిన నభా నటేష్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. భరతనాట్యంపై ఆసక్తితో పాటు మోడలింగ్‌లో అడుగుపెట్టి, ఆ తర్వాత సినీ రంగంలోకి ప్రవేశించారు. కేవలం 19 ఏళ్ల వయసులోనే నటిగా కెరీర్‌ను ప్రారంభించారు. 2015లో విడుదలైన 'వజ్రకాయ' చిత్రంతో ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు. ఇందులో శివరాజ్‌కుమార్ సరసన నటించి మంచి గుర్తింపు సంపాదించారు. అనంతరం 2018లో విడుదలైన 'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. 2019లో రామ్ పోతినేని సరసన నటించిన 'ఇస్మార్ట్ శంకర్' నభా కెరీర్‌కు కీలక మలుపుగా నిలిచింది. ఈ సినిమా ఘనవిజయం సాధించడంతో టాలీవుడ్‌లో ఆమెకు వరుస అవకాశాలు లభించాయి. తర్వాత 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'అల్లుడు అదుర్స్', 'మాస్ట్రో', 'డార్లింగ్' చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. ప్రస్తుతం నభా నటేష్ చేతిలో పలు క్రేజీ ప్రాజెక్టులు ఉన్నాయి. 2026లో విడుదల కానున్న 'నాగబంధం' చిత్రంలో పార్వతి పాత్రలో నటిస్తుండగా, 'స్వయంభూ' చిత్రం నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. అందం, అభినయం, గ్లామర్‌తో దక్షిణాది చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని నభా నటేష్ కొనసాగిస్తున్నారు.



# సముద్రతీరంలో కోమలీ అందాల సందడి

తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి కోమలీ ప్రసాద్ మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. నటిగా కంటే సోషల్ మీడియాలోనే ఎక్కువగా అభిమానులతో టచ్‌లో ఉండే ఈ భామ, తాజాగా షేర్ చేసిన బీచ్ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. సముద్రతీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో దిగిన ఈ ఫొటోల్లో కోమలీ ఎంతో స్టైలిష్‌గా, ఎలిగెంట్‌గా కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది.ఈ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ.. "వర్షం పడుతున్నప్పుడు... ఆకాశ రంగుల కింద... సముద్రతీరంలో నన్ను కలవండి!" అంటూ రొమాంటిక్, కవితాత్మకమైన క్యాప్షన్‌ను జత చేసింది. ఈ క్యాప్షన్‌కు తగ్గట్టుగానే ఫొటోషూట్ కూడా ఎంతో అందంగా ఉండటంతో అభిమానులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. కోమలీ సహజ అందం, సింపుల్ స్టైలింగ్, బీచ్ బ్యాక్‌డ్రాప్ కలిసివచ్చి ఈ ఫొటోషూట్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.




ఈ పోస్ట్‌కు కొన్ని గంటల్లోనే వేలాది లైకులు, వందల సంఖ్యలో కామెంట్లు రావడం విశేషం. అభిమానులు హార్ట్, ఫైర్ ఎమోజీలతో స్పందిస్తూ ఆమె అందాన్ని కొనియాడుతున్నారు. కొందరు "టాలీవుడ్ క్వీన్", "ఏంజెల్" అంటూ ప్రశంసిస్తుండగా, మరికొందరు "మహానటి సావిత్రి మళ్లీ వచ్చేసినట్టుంది" అంటూ కామెంట్లు చేశారు. ఇంకొందరు సరదాగా "ఏ బీచ్‌కు రావాలో చెబితే వచ్చి కలుస్తాం" అంటూ స్పందించారు.అయితే కొందరు నెటిజన్లు భిన్నమైన అభిప్రాయాలు కూడా వ్యక్తం చేశారు. "కొంచెం బొద్దుగా ఉంటే ఇంకా బాగుంటుంది" అని కొందరు కామెంట్ చేయగా, "ఇన్ని ఫొటోలు ఎందుకు... ఒక్కటి చాలు" అంటూ మరికొందరు తమ అభిప్రాయాన్ని వెల్లడించారు. అయినప్పటికీ ఎక్కువ మంది అభిమానులు మాత్రం కోమలీ కొత్త ఫొటోషూట్‌ను ప్రశంసిస్తూ సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.

మలీ ప్రసాద్ సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే ప్రతిభ, అందం రెండూ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అవకాశాలు మాత్రం దక్కలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో ఉంది. 2022లో విడుదలైన 'హిట్ 2' చిత్రంలో కీలక పాత్ర పోషించి మంచి గుర్తింపు తెచ్చుకున్నప్పటికీ, ఆ తర్వాత హీరోయిన్‌గా పెద్ద అవకాశాలు మాత్రం రాలేదు. దీంతో ఆమె కెరీర్ ఆశించినంత వేగంగా ముందుకు సాగలేకపోయింది.

అయినా నిరుత్సాహపడకుండా డిజిటల్ వేదికలపై కూడా తన ప్రతిభను చాటుతోంది. గతేడాది విడుదలైన 'టచ్ మీ నాట్' వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ప్రస్తుతం సినిమాలకు కాస్త దూరంగా ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో వరుస ఫొటోషూట్లతో అభిమానులకు చేరువవుతూ దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యం ఉన్న పాత్రలు వస్తే చేయడానికి సిద్ధంగా ఉన్నాననే సంకేతాలను కూడా తన సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఇస్తోంది.

# నాగ్ కలం నుంచి 'లెనిన్'కు పవర్?





అక్కినేని అఖిల్ హీరోగా తెరకెక్కిన తాజా యాక్షన్ ఎంటర్‌టైనర్ 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. జూలై 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తొలి రోజు నుంచే మంచి స్పందనను సొంతం చేసుకుంది. యాక్షన్, ఎమోషన్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్లు కూడా ఆశాజనకంగా నమోదవుతున్నాయి. ఇదిలా ఉంటే, ఈ సినిమా విజయానికి కింగ్ నాగార్జున చేసిన ప్రత్యేక కృషికి సంబంధించిన ఓ ఆసక్తికరమైన ప్రచారం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

అఖిల్ కెరీర్‌లో ఈ సినిమా కీలక మలుపు కావాలని నాగార్జున మొదటి నుంచే భావించినట్లు తెలుస్తోంది. గత చిత్రాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వకపోవడంతో, ఈసారి ఎలాంటి రాజీ పడకుండా 'లెనిన్'ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఆయన పలు సూచనలు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. కథ, పాత్రల రూపకల్పన, ఎలివేషన్ సన్నివేశాల విషయంలో కూడా నాగార్జున ప్రత్యేక ఆసక్తి కనబరిచినట్లు టాక్ వినిపిస్తోంది.సినీ వర్గాల సమాచారం ప్రకారం, సినిమాలో అఖిల్ పాత్రను మరింత బలంగా నిలబెట్టే ఒక కీలక సన్నివేశాన్ని నాగార్జున స్వయంగా రాశారట. హీరో పాత్రకు మరింత ఎలివేషన్ వచ్చేలా ఆ సీన్‌ను రూపొందించి, అది తెరపై ప్రభావవంతంగా కనిపించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని చెబుతున్నారు. కథలో సహజంగా కలిసిపోయేలా ఆ సన్నివేశాన్ని రూపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా అఖిల్, నటుడు శివాజీ మధ్య సాగే ఆ ఎలివేషన్ సీన్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచిందని టాక్. ఈ సన్నివేశాన్ని రాత్రి వేళల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చిత్రీకరించినట్లు సమాచారం. షూటింగ్ సమయంలో నాగార్జున స్వయంగా పర్యవేక్షిస్తూ, ప్రతి షాట్‌ను జాగ్రత్తగా పరిశీలించినట్లు సినీ వర్గాలు పేర్కొంటున్నాయి. తెరపై ఈ సన్నివేశం చూసిన ప్రేక్షకులు భారీగా స్పందిస్తున్నారని, థియేటర్లలో విజిల్స్, చప్పట్లతో ఆ సీన్‌కు మంచి రెస్పాన్స్ వస్తోందని అభిమానులు చెబుతున్నారు. కొడుకు విజయాన్ని చూడాలనే తండ్రి తపనతో నాగార్జున ఈ సినిమాపై ప్రత్యేక దృష్టి పెట్టారని అభిమానులు వ్యాఖ్యానిస్తున్నారు. అఖిల్ కెరీర్‌కు 'లెనిన్' ఒక బలమైన మైలురాయిగా నిలవాలని ఆయన కోరుకున్నట్లు కూడా చర్చ సాగుతోంది. సినిమాకు సంబంధించిన ప్రతి అంశాన్ని దగ్గరుండి పరిశీలిస్తూ అవసరమైన చోట సూచనలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది.అయితే నాగార్జున స్వయంగా సన్నివేశం రాశారనే విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయినప్పటికీ ఈ ఇన్‌సైడ్ టాక్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ అభిమానుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమా విజయంతో పాటు ఈ ప్రచారం కూడా 'లెనిన్'కు అదనపు ఆకర్షణగా మారింది.

# పెళ్లి పీట లెక్కనున్నారా?

సోషల్ మీడియాలో సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ సీఈఓ కావ్య మారన్ పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం మరోసారి జోరందుకుంది. ఈసారి కేవలం పెళ్లి వార్తలే కాకుండా, వివాహ తేదీలు, వేదికపై కూడా పలు కథనాలు వైరల్ అవుతున్నాయి. దీంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.

గత కొంతకాలంగా అనిరుధ్, కావ్య రిలేషన్‌షిప్‌లో ఉన్నారనే వార్తలు వినిపిస్తున్నప్పటికీ, వారిద్దరూ ఎప్పుడూ అధికారికంగా స్పందించలేదు. కొద్ది రోజుల క్రితం అనిరుధ్ స్వయంగా ఈ రూమర్లను ఖండించడంతో ఆ ప్రచారానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. అయితే తాజాగా అనిరుధ్ కుటుంబ సభ్యుడు, సీనియర్ నటుడు వైజీ మహేంద్రన్ ఓ ఇంటర్వ్యూలో అనిరుధ్ వివాహంపై చేసిన వ్యాఖ్యలతో ఈ అంశం మళ్లీ చర్చనీయాంశమైంది.

కోలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం ప్రకారం ఈ ఏడాది నవంబర్‌లో మూడు రోజుల పాటు వివాహ వేడుకలు నిర్వహించి, విదేశాల్లోని ఓ ప్రముఖ డెస్టినేషన్‌లో పెళ్లి జరపాలని కుటుంబాలు ఆలోచిస్తున్నట్లు కథనాలు వస్తున్నాయి. అయితే ఈ వివరాలపై ఎలాంటి అధికారిక ధృవీకరణ లేదు.సన్ గ్రూప్ నిర్మించిన పలు చిత్రాలకు అనిరుధ్ సంగీతం అందించడంతో కావ్య మారన్‌తో ఆయనకు పరిచయం ఏర్పడిందని, ఆ స్నేహమే ప్రేమగా మారిందని కూడా సోషల్ మీడియాలో ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలను ఇప్పటివరకు ఎవరూ అధికారికంగా నిర్ధారించలేదు.

ప్రస్తుతం అనిరుధ్ వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉండగా, కావ్య మారన్ సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు వ్యవహారాలను పర్యవేక్షిస్తూ గుర్తింపు పొందుతున్నారు. ఐపీఎల్ సీజన్‌లో ఆమెకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తరచూ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి.

అయితే ప్రస్తుతం వైరల్ అవుతున్న పెళ్లి వార్తలను అధికారిక సమాచారం లేనంత వరకు రూమర్లుగానే పరిగణించాలి. అనిరుధ్ లేదా కావ్య మారన్ కుటుంబాల నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com